తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

30 ఏళ్ళ ప్రస్థానం
వార్త
వార్షికోత్సవం
1996 - 2026

# పంచాయతీరాజ్ కమిషనర్‌చే...సీఎం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన



ఓబులవారిపల్లి, 26 జూన్ ప్రభాతవార్త: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లి గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న స్థలాన్ని వీబీజీ రాంజీ గ్రామీణ పథక సభ స్థలాన్ని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ మరియు జిల్లా యంత్రాంగం బృందం కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి మరియు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెల రెండవ తేదీన జరగబోవు బీవీజీ రాంజీ గ్రామీణ పథక ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కేంద్ర మంత్రులు రానున్న సందర్భంగా స్థల ఏర్పాట్లు, తదితర విషయాల పైన ఆరా తీసి స్థలాన్ని పరిశీలించారు. అంతేకాకుండా ఎంతో సుందరంగా సభా ప్రాంగణం ఉండాలని, సభ ఏర్పాట్లకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. వీవీపీ పార్కింగ్ హెలిప్యాడ్ ప్రాంగణం ప్రదేశాలను పరిశీలించారు. వివిపిలు మరియు సభకు సంబంధించిన మ్యాపులను వివిధ శాఖలకు సంబంధించిన ఏర్పాటును క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అధికారులకు బ్లూ ప్రింట్ ద్వారా వివరించడం జరిగింది అనంతరం ఎక్కడ ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, సభ సజావుగా జరిగేందుకు అధికారులతో సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు మొక్కసాయి వికాస్‌రెడ్డి మరియు కోటమి నాయకులు ఎన్డీఏ కూటమి నాయకులు అధికారులు పంచాయతీరాజ్ సిఈఓ సుబ్రహ్మణ్యం ఎంపీడీవో ఈవోపీఆర్డి తహశీల్దార్ సిద్దేశ్వరరావు కూటమి నాయకులు నియోజకవర్గంలో ఉన్న కార్యకర్తలు, జిల్లా యంత్రాంగం అధికారులు పాల్గొన్నారు.

# కోవర్టు కాలనాగులు!

## కూటమి నేతలతో తిరుపతిలో తలనొప్పి యవ్వారం

ప్రభాతవార్త-తిరుపతి: కరవమంటే కప్పకు కోపం వదలమంటే పాముకు శాపంలా తిరుపతిలో కూటమి పార్టీల నేతల యవ్వారం తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వైసిపితో కాపురం చేసి ఆ తరువాత 2024 ఎన్నికలకు ముందు బయటకు వచ్చిన కొందరు మాజీ కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చలామణి అవుతున్నారు. ఇప్పటికీ ఆ నేతలు ఏపార్టీలో ఉన్నారనేది కూడా స్పష్టంగా తేలలేదు. వైసిపి కోవర్టులు తిరుపతిలో కూటమికి తూట్లు పొడుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కొందరు కోవర్టు నేతలు ప్రసన్నం చేసుకుని వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు నియోజక వర్గం ఇన్‌చార్జి భూమన అభినయ్ రెడ్డిని కేసుల నుంచి కాపాడుతున్నారని జనంలో గుప్పుమంటోంది. వైసిపి పాలనలో తిరుపతిలో అనేక అక్రమాలు అవకతవకలు జరిగాయి. భూకబ్జాలు జరిగాయి. గత లోక్ సభ ఉప ఎన్నికల్లో భారీ ఎత్తున వైసిపి నేతలు దొంగ ఓట్లు వేయించారు. టిడిఆర్ బాండ్ల పేరుతో లక్షలు దోచుకున్నారు.గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన వారిని నామినేషన్లు కూడా వేయనీయలేదు. 2021లోనే 50 వార్డుల్లో 48 మంది వైసిపి కార్పొరేటర్లు ఏకగ్రీవం అయ్యారు. ఒక చోట ఎన్నిక ఆగిపోగా మరొక చోట టిడిపి అభ్యర్థి ఎన్నికయ్యాడు. ఇలాంటి అక్రమాలు సహించలేని తిరుపతి ఓటర్లు 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డిని 61,956 ఓట్ల తేడాతో ఓడించి జనసేన అభ్యర్థి శ్రీనివాసులును గెలిపించారు. అయితే కూటమి అధికారంలోకి రాగానే వైసిపి కార్పొరేటర్లు కొందరు ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పంచన చేరారు. మరి కొందరు ఎమ్మెల్యే శ్రీనివాసు లును ఆశ్రయించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అభిన యరెడ్డి డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేయడంతో గత ఏడాది ఆ ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ నేపద్యంలో డిప్యూటీ మేయర్ పదవి దక్కించుకోవడానికి కార్పొరేటర్ అన్నా అనితా తనతో పాటు కొందరిని మంత్రి అనగాని సత్యప్రసాద్ ద్వారా టిడిపిలో చేర్పించారు. మరో కార్పొరేటర్ నరసింహను డిప్యూటీ మేయర్ చేయాలని ఇంకొందరు ఎమ్మెల్యే ద్వారా ప్రయత్నం చేశారు. ఎన్నికల సమయంలో మెజారిటీ సభ్యులు వైసిపి నుండి టిడిపి వైపు మొగ్గు చూపారు. అయితే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తమ ఏకైక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ కు బి ఫారం పంపడంతో ఆయన డిప్యూటీ మేయర్ అయ్యారు. దీంతో పలువురు కార్పొరేటర్లు అదే రోజు రాత్రి కరుణాకర్ రెడ్డి నివాసానికి వెళ్ళి క్షమించమని కోరారు. అయితే కూటమి నేతలతో జత కట్టిన కొందరు కార్పొరేటర్లు ఇప్పటికీ కోవర్టులుగా పనిచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పదవీ కాలం ముగిసినా పెత్తనం చెలాయిస్తున్నారని అంటు న్నారు. గత ఏడాది టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ బి సుధాకర్‌రెడ్డి పరోక్షంగా మంత్రిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు వివాదంగా మారాయి. ఇదే సమయంలో వైసిపి నుంచి వచ్చిన అనితాయాదవ్‌కు మంత్రి టిడిపి రాష్ట్ర కార్యదర్శి పదవి ఇప్పించారు. 40 ఏళ్లుగా పార్టీకి సేవలు అందిస్తున్న సీనియర్ నేతలకు పదవులు రాకుండా అడ్డుపడ్డారనిఅంటున్నారు.ఇప్పుడు గత వైసిపి మాజీ కార్పొరేటర్లు కోవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని నియోజక వర్గంలోని పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధిష్ఠానం పార్టీని ప్రక్షాళన చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని కోరుతున్నారు.

# చిన్నశేష, హంస వాహనాలపై శ్రీనివాసుడు





చిన్నశేష,హంస వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

వడమాలపేట, జూన్ 26 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం స్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై వేణుగోపాలస్వామి అలంకారంలో దివ్య మంగళ రూపంతో భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి, ఉభయ దేవేరులకు అభిషేకం, అలంకరణ జరిగింది. ఉదయం 6.30 గంటలకు వాహన మండపం చేరుకున్న శ్రీవారు వేణుగోపాలస్వామి అలంకరనలో ముస్తాబై వాహనాన్ని అధిరోహించారు. భక్తుల గోవింద నామాలు, కళాకారుల నృత్యాలతో ముందు వెళుతుండగా మాడా వీధుల్లో విహరించారు. చిన్నశేష వాహనం శ్రీవారి వ్యక్తరూపమైన పంచభౌతిక ప్రకృతికి ప్రతీకగా భావిస్తారు. పంచశిరస్సులతో కూడిన చిన్నశేషునిపై స్వామివారిని దర్శించడం ద్వారా భక్తులకు సర్వశుభాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక పురోగతి కలుగుతాయని ఆగమ, పురాణాలు పేర్కొంటున్నాయి. తిరిగి వాహన మండపం చేరుకున్న స్వామివారికి ఘనంగా స్నాపన తిరుమంజనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఊంజల్‌సేవ జరిగింది. 6.30 గంటలకు వాహన మండపం చేరుకున్న వెంకటేశ్వరుడు అలంకరించిన హంస వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరిం టెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్, కంకణ బట్టార్ సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, తిప్పాయాచార్యులు, అర్చకులు, టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజా భద్రత మరింత బలోపేతం

**- రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా**



చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త: ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసి ప్రజలకు మరింత సమర్థవంతంగా పోలీసు సేవలు అదించాలని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా శాంతిభద్రతల విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మదుసూధన్‌రెడ్డితో కలిసి చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం అదనపు డిజిపి, అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ శేముషి, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జిల్లా అదనపు ఎస్పీలు, డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లతో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలన్నారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, సాంకేతికత ఆధారిత ఆధునిక పోలీసింగ్, పోలీసు సంక్షేమం, ప్రజా సేవల మెరుగుకు ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని పోలీసులకు దిశా నిర్ధేశం చేశారు. ప్రజల విశ్వాసంను పెంపొందించడంతో పాటు ఆధునిక, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌కు చిత్తూరు జిల్లా ఇతర జిల్లాలకు ఆదర్శకంగా నిలుస్తోందని ప్రశంసించారు. ఎస్పీ తుషార్ దూడి జిల్లాలో డ్రోన్ సాంకేతికత, నేర నియంత్రణ, జనసమర్థ్య ప్రదేశాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్న తీరును డిపిజికి వివరించారు. అలాగే ప్రతి సబ్ డివిజన్ పరిధిలో నిరంతర డ్రగ్స్, గంజాయి నిరోధక తనిఖీలు, డ్రగ్ టెస్టింగ్, అవగాహన కార్యక్రమాల ద్వారా మాదకద్రవ్యాల కట్టడికి తీసుకుంటున్న చర్యలను డిపిజికి వివరించారు. అలాగే ఎస్పీ మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ శక్తి టీమ్స్ ద్వారా తక్షణ స్పందన, అవగాహన కార్యక్రమాలు, భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలు చేస్తున్న వివరాలను డిజిపికి విశదీకరించారు. అలాగే జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న 'ధైర్య స్పర్శ-భయానికి ముగింపు భద్రతకు ఆరంభం' కార్యక్రమం ద్వారా క్రైమ్ హాట్ స్పాట్‌లలో ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజల్లో భద్రతా భావంను పెంపొందిస్తున్నట్లు, అలాగే 'జన విశ్వాస్-సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణాలు' కార్యక్రమం ద్వారా క్యూఆర్ కోడ్ ఆధారిత ఆటో రిక్షా భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నామని, 'సురక్షిత చిత్తూరు-మీ భద్రత మా బాధ్యత' కార్యక్రమం ద్వారా మహిళల భద్రత, చిన్నారుల రక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముందు జిల్లా పర్యటన నిమిత్తం చిత్తూరు వచ్చిన డిజిపి హరీష్‌కుమార్ గుప్తాకు ఎస్పీ తుషార్ దూడి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# పక్కాగా భూముల రీ-సర్వే

**- సర్వే, భూరికార్డులశాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్**



రీ-సర్వేలో తలెత్తె వివాదాలను పరిష్కరించుకోవడానికి పాటించాల్సిన ప్రొసీజర్స్‌పై సర్వేయర్లకు జరిగిన వర్క్‌షాప్

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త: భూముల రీ-సర్వేలో ప్రతి రైతు యొక్క భూమిని పక్కాగా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సర్వే, భూరికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం రీ-సర్వే సమయంలో తలెత్తే భూవివాదాలపై పాటించాల్సిన నియమ నిబంధనలపై డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ ఆధ్వర్యంలో సర్వేయర్లకు వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో సర్వే, భూరికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ మాట్లాడుతూ భూముల రీ-సర్వేలో ఎఫ్ లైన్స్, పట్టా సబ్ డివిజన్, ఆన్‌లైన్ సబ్‌డివిజన్, రీ-సర్వే తదితర సర్వే పనులు చేపట్టాల్సిన సమయంలో అర్జీదారులు, రైతులతో ఎలా ప్రవర్తించాలి! అర్జీలను పరిష్కరించే క్రమంలో పాటించాల్సిన ప్రొసిజర్స్, బిహేవియర్, పద్ధతులు పరిష్కరించిన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయు విధానం, అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో పెద్దపంజాణి సర్వేయర్ మాట్లాడుతు రీ-సర్వే జరిగిన అనంతరం విస్తీర్ణ సవరణ అర్జీని పరిష్కరించినపుడు టైం లైన్స్ పెంచవలసినదిగా కోరారు. అలాగే బైరెడ్డిపల్లి మండల సర్వేయర్ నరేష్, యాదమరి మండల సర్వేయర్ తులసీధర్, తవణంపల్లి మండల సర్వేయర్ మురళీధర్, చిత్తూరు అర్బన్ తహసిల్దారు కుచేంద్ర, పలమనేరు మున్సిపల్ సర్వేయర్ అంజనేయులు అర్జీలను పరిష్కరించే క్రమంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేశారు. అలాగే సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ల్యాండ్ సర్వే అధికారి ఎ.పుల్లయ్య, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే చిట్టిబాబు, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే రమణారెడ్డి, కృష్ణమూర్తి, రవిచంద్ర, బి.ప్రసాద్‌రావు, రవిశేఖర్, ఆర్‌వి ప్రసాద్‌రావు, జిల్లాలోని మండల సర్వేయర్లు, మండల డిప్యూటీ సర్వేయర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేర్లపాక వద్ద మంత్రి లోకేష్‌చే...

# కార్యకర్తల సమావేశానికి సన్నాహాలు

**-స్థలం పరిశీలించిన ఎంఎల్‌ఏ**



లోకేష్ సమావేశం వేదికను పరిశీలిస్తున్న ఎంఎల్ఏ నాయకులు

ఏర్పేడు,జూన్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రదాన కార్యదర్శి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ కార్యకర్తల సమావేశానికి సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి వేదిక ఏర్పాటుకు సంబంధించి పరిశీలించారు. ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్ర సందర్భంగా మూడు రోజుల పాటు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన లోకేష్ యువతకు మార్గదర్శ కమయ్యారు. ఎన్నికలు జరిగి రెండేళ్ళ తరువాత మళ్ళీ కార్యకర్తలతో ముఖాముఖికి లోకేష్ వస్తున్నారు. అయితే నియోజవర్గంలోని మధ్య కేంద్ర బిందువుగా ఏర్పేడు మండలంలోని మేర్లపాక వద్ద ఏర్పాటు చేయుటకు నిర్ణయించారు. జూలై 1న లోకేష్ పర్యటన ఖరారు అయినట్లు సమాచారం. ఇందుకు శాసనసభ్యుడు భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తిటౌన్, తొట్టంబేడు మండలాలకు సంబంధించి కార్యకర్తలతో లోకేష్ మమేకం కానున్నారు. ఒక్కొక్కమండలం నుంచి 250 మంది కార్యకర్తలకు అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లలో ఏ మాత్రం లోటు రాకుండా పక్కా ప్రణాళికతో శాసనసభ్యుడు పర్యవేక్షిస్తున్నారు. తెలుగుదేశం కార్యకర్తల్లో ఉత్సాహం నింపటానికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పట్టుబట్టి ఆదే తారీఖులో యువ నాయకుడు లోకేష్ పర్యటనను ఖరారు చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో రానున్న పంచాయతీ ఎన్నికల సందర్భంగా యువకులను భాగస్వాముల్ని చేయుటకు వారిలో ఉత్సాహం నింపటానికి అన్ని పంచాయతీల్లో తెలుగుదేశం మద్దతుదారులు విజయం సాధించుటకు ప్రణాళికలతో ఎంఎల్ఏ ముందడుగు వేసారని చెప్పవచ్చు. పార్టీలో తన మార్కును ఆపాదిస్తూ పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇస్తూ కొత్త పోకడలతో ముందుకు వెళుతున్న శాసనసభ్యునికి మొదటి సారి పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయి. ఇప్పటికే అధిష్టానం అన్ని పంచాయతీల్లో తెలుగుదేశం జెండా ఎగురవేయాలని ఆదేశించారు. దాంతో శాసనసభ్యుడు లోకేష్ కార్యక్రమాల్లో కార్యకర్తల్లో కొత్త జోష్ నింపటానికి నిర్ణయం తీసుకున్నారు.ఈ మేరకు శుక్రవారం ఏర్పాట్లును పరిశీలించారు.ఆయనతో పాటు మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు జడ్‌పిటిసి వవెంకటసుబ్బారెడ్డి మండలం పార్టీ అధ్యక్షుడుపేరం నాగరాజునాయుడు మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులునాయుడు తాటపర్తి రవీంద్రరెడ్డి, జయచంద్రనాయుడు, శివశంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మనోహర్‌నాయుడు, కేశినేని సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల...ఎన్నికల పరీక్ష

**- కుర్చీలను ఏకగ్రీవం చేయడానికి ఇప్పటి నుండి ముమ్మరంగా ప్రయత్నాలు- గతంలో వైకాపా చేసిన తరహాలో ఏకగ్రీవాలు చేయాలని వ్యూహాలు**

**- పలు చోట్ల సొంత పార్టీ నాయకుల మధ్య సర్పంచ్ కుర్చీలకు పోటీ!**



చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు అగ్నిపరీక్ష కానున్నాయి. త్వరలో జరుగనునన్న పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీలు మద్దతు పలికే అభ్యర్థులు విజయం సాధించేలా వ్యూహాలు రచించి అమలు చేయడానికి ఇప్పటి నుండి అధికార పార్టీ తెలుగుదేశంకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం నుండి సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు పక్కాగా విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పార్టీ ఎమ్మెల్యేలకు ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. దీంతో జిల్లాలోని కొంతమంది తెలుగుదేశం ఎమ్మెల్యేలు అప్పుడే పంచాయతీ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతుదారుడిగా ఎవరిని నిలబెట్టాలి! నిలబెట్టిన పార్టీ మద్దతుదారుడి విజయం కోసం ఎలాంటి వ్యూహం రచించి అమలు చేయాలి! అనే విషయంపై కొంతమంది ఎమ్మెల్యేలు ఇప్పటికే సర్పంచ్ పదవులకు పోటీ పడుతున్న పార్టీ నాయకులతో సమాలోచనలు సాగించి పార్టీ మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు ఒక్కరే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వుంటే ఎక్కడా పెద్దగా సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశం వుండదు. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో వుండటం, కూటమికి తెలుగుదేశం పార్టీ నాయకత్వం వహిస్తుండగా జనసేన, బిజెపిలు కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్నారు. రాష్ట్రంలో రెండేళ్ళ క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జనసేన, బిజెపి పార్టీలకు నామమాత్ర సీట్లు కేటాయించినప్పటికీ ఆ పార్టీ నాయకత్వాలు అంగీకరించాయి. అయితే ప్రస్తుతం జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో తమ పార్టీలను సైతం బలోపేతం చేసుకోవడానికి తమ పార్టీలకు సైతం వీలైన మేరకు ఎక్కువ స్థానాలు కేటాయించాలని జనసేన, బిజెపి పార్టీలు తెలుగుదేశం పార్టీ అధిష్టానంతో పట్టుపట్టే అవకాశం కన్పిస్తోంది. ఈ వ్యవహారం జిల్లాలోని మెజార్టీ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలతో పాటు క్షేత్ర స్థాయిలో పటిష్టంగా వున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు నచ్చడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం తమకు పెద్దగా బలం లేని ఏ కొన్ని ప్రదేశాల్లో మాత్రమే జనసేన, బిజెపిలకు కేటాయించాలని అత్యధిక స్థానాల్లో తమకు బలం వుండటంతో తెలుగుదేశం మద్దతుదారులకు అభ్యర్థిత్వాలు కట్టబెట్టి మద్దతు తెలపాలని ఆ పార్టీకి చెందిన నాయకులు వ్యూహాలు పన్నుతున్నారు. జిల్లాలో వాస్తవంగా జనసేన, బిజెపి పార్టీలకు పెద్దగా పట్టులేదు. క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీకి గట్టి పట్టు వుండటంతో ఈ పార్టీ స్థానిక సంస్థల్లో ఇతర పార్టీలకు స్థానాలు కేటాయించడానికి ససేమిరా అంగీకరించే అవకాశం కన్పించడం లేదు. అలాగే పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున అత్యధిక స్థానాల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ చేయడానికి ఒకరి కంటే ఎక్కువ మంది నాయకులు పోటీ పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పంచాయతీ ఎన్నికలను ఆ పార్టీ ఏకగ్రీవంగా నిర్వహించి జిల్లాలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. ప్రస్తుతం జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో సైతం గతంలో వైకాపా వ్యవహరించిన విధంగా ఎన్నికలు నిర్వహించి అత్యధిక పంచాయతీలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మెజార్టీ తెలుగుదేశం ఎమ్మెల్యేలు పంచాయతీ ఎన్నికల్లో ఒకే అభ్యర్థి పోటీలో వుండేలా పోటీలో వున్న అభ్యర్థులతో చర్చలు నిర్వహిస్తున్నారు. అయితే కొంతమంది పంచాయతీ ఎన్నికల్లో పోటీ నుండి విరమించుకోవడానికి ససేమిరా అంగీకరించడం లేదు.

# ధృవీకరణ, నమోదు పారదర్శకంగా వుండాలి

**-సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం ప్రత్యేక దృష్టి సారించాలి -జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీస్తున్న కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 27 ప్రభాతవార్త : ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల నమోదు, ధృవీకరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుపతి ఆటో నగర్, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు శంకర్ నాయుడు కాలనీ ముత్యాలమ్మ గుడి వీధిలో, వసుంధర నగర్‌లో విస్తృతంగా పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి జిల్లాలో నమోదు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించడంతో పాటు ఎన్రోల్మెంట్ ఫారాలను తప్పనిసరిగా అందజేసి వాళ్లకు అర్థమయ్యేలా వివరించి పారాలను పూరించడంలో సహకరించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియ పురోగతిని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్లకు స్వయంగా ఎన్రోల్మెంట్ ఫారాలను అందజేశారు. ఇంటింటి సర్వే సందర్భంగా 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుతం ఆ గృహాల్లో నివసిస్తున్న ఓటర్ల వివరాలను సరిపోల్చాలని కలెక్టర్ సూచించారు. జాబితాలో ఉన్న వ్యక్తులు ఆ ఇంటిలో లేకపోతే వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారో గుర్తించి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ప్రత్యేక కార్యాచరణతో పనులను వేగవంతం చేసి శాతాన్ని గణనీయంగా పెంచాలని అధికారులకు సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. బీఎల్‌వోలు ప్రతి గృహాన్ని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయాలని, ఎవరూ మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల నమోదు, ధృవీకరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి రూరల్ తహసిల్దార్ జనార్దన్ రాజు, బిఎల్ఏలు బిఎల్‌వోలు పాల్గొన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ తిరుపతి అర్బన్ మండలం ఆటోనగర్లో పర్యటించి అక్కడ జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇదిలా ఉండగా పట్టణ పరిధిలో సర్ ప్రక్రియ పరిశీలన సందర్భంగా స్థానికులు తమ ప్రాంతంలో సరఫరా అవుతున్న త్రాగునీరు సక్రమంగా వస్తుందా, పింఛను ఒకటో తేదీ అందుతుందా అని ఆరా తీశారు, డ్రైనేజీని పరిశీలించి సక్రమంగా క్లీన్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణ ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ ఉప కమిషనర్ అమరయ్య, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, ఎలక్షన్ డి టి సుధాకర్ నాయక్ రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27-6Pg9th cheli 1:27-6Pg9th cheli 1.qxd 6/26/2026 11:18 PM Page 1



# పూల ఆర్గంజా లెహంగాలు

ఫ్యాషన్ ఫ్యాషన్





రంగు రంగుల పూల డిజైన్లతో, తక్కువ బరువుతో ఉండే ఆర్గంజా లెహంగాలు భలే లుక్ ఇస్తాయి. అందుకే ఆ తరం, ఈ తరం అనే తేడా లేకుండా కాలేజీ అమ్మాయిల నుంచి నడివయసు వాళ్లవరకూ వీటిని వేసుకుని మురిసిపోతున్నారు. ఎంబ్రాయిడరీ, క్రిస్టల్, మిర్రర్, క్రష్డ్, శాటిన్.. అంటూ రకరకాల లెహంగాలు అతివల మనసు దోచేస్తున్నాయిప్పుడు. అల్లంత దూరాన ఉన్నా కూడా.. ఆకాశంలో తారల్లా మెరిసిపోతున్నారు. ఒకప్పుడు పెళ్లిళ్లూ, వేడుకలంటేబ్రైడ్, బోల్డ్ రంగులే. కానీ, ప్రస్తుతం మ్యూటెడ్, పేస్టల్ షేడ్స్ ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ పూల ఆర్గాంజా లెహంగా ఒక్కటన్నా ఉండాల్సిందే అనుకుంటున్నారంతా. ఇక ఫ్యాషన్ ప్రియుల సంగతి చెప్పనక్కర్లేదు. వాళ్ల వార్డ్‌రోబ్‌లో అయితే, ఆర్గెంజా లెహంగా తప్పక ఉండాల్సిందే. అందుకే హల్దీ, మెహందీ, సంగీత్‌లకు మోడ్రన్‌గా కనిపించాలనుకుంటే ఫ్లోరల్ డిజైన్‌లను ఎంచుకుంటున్నారు ముద్దుగుమ్మలు. ఏ రిసెప్షనో, స్నేహితురాలి పెళ్లికో అయితే, కొంచెం గ్రాండ్‌గా బ్లౌజ్‌కూ, స్కర్ట్ బోర్డర్‌కూ జరీ, సీక్విన్స్ ఎంబ్రాయిడరీ లాంటివి చేయించి.. సందర్భమేదైనా ఫ్యాషనబుల్‌గా, హుందాగా ఉండడంతో పాటు సౌకర్యంగానూ ఉంటాయివి. వీటి మీదకు మరీ హెవీ జ్యూయెలరీ అవసరం కూడా ఉండదు. కాబట్టి, మెడలో ఓ చిన్న చోకర్ వేసుకుని జుట్టు వదిలేస్తే చాలు. సింపుల్ లుక్‌లో మెరిసిపోతారంతే.





# కట్టె కాలే దాకా.. ఇక్కడే ఉంటా !!



జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి 'గరీయసీ' అన్న శ్రీరామచంద్రుడి వాక్యాలను పుణికిపుచ్చుకున్నట్లుంది ఓ వృద్ధురాలు తన మాతృభూమిలోనే కాలం చెయ్యాలని ఆశపడ్తోంది. మమ్మూటికీ, అది పుట్టిన గడ్డ మీద మమకారమే. అందుకే తనకట్టె ఇక్కడే కాలాలని కోరుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో మధ్యలో మరో దేశ పౌరసత్వం పొందినా భారత్‌కి తిరిగొచ్చాక తాజాగా బాపట్ల కలెక్టర్ ముందు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, దేశ చట్టాలకు కట్టుబడి ఉంటానని ప్రమాణం చేశారు. అమెరికా పౌరసత్వం కలిగిన ఓ భారతీయ వృద్ధురాలు ఇప్పుడు తన పౌరసత్వాన్ని వదులుకోవాలని నిర్ణయించుకోవడం స్వాగతించదగినది. ఇన్నాళ్ల తన జీవితకాలంలో జీవితపు లోతుపాతాలు, జీవనగమనంలో ఎగుడు దిగుడులను చవిచూసిన పాతగుంటూరు వాసి 94 ఏళ్ల కొండ్రగుంట మహాలక్ష్మమ్మ తన జన్మభూమిని మరువలేక తనకు భారతీయ పౌరసత్వంలోనే తుదిశ్వాస విడవాలని ఆకాంక్షిస్తున్నారు. 2000 సంవత్సరంలో ఆమె అమెరికా పౌరసత్వం పొందారు. దాదాపు 18 ఏళ్ల పాటు తన సంతతి బాగోగులు చూసుకుంటూ అక్కడే ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితమే భారతదేశానికి వచ్చినా ఇప్పుడామె తనకు భారత పౌరసత్వమే ముద్దంటూ బాపట్ల కలెక్టర్‌ని కలిసి తనకు భారతీయ పౌరసత్వం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా, చినగంజాం మండలం చింతగుంపాల గ్రామానికి చెందిన, శ్రీమతి లక్ష్మమ్మ బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి తన మనోగతాన్ని వివరించారు. ఆమె కుమారుడు వర్జీనియాలో స్థిరపడడంతో అక్కడికెళ్లాల్సి వచ్చింది.

# కాఫీ

వేగవంతమైన మన దైనందిన జీవితంలో కాఫీ అవసరం చాలా ఉందనే చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా 400 బిలియన్ కప్పుల కాఫీని రోజువారీ అవసరాల నిమిత్తమై వినియోగిస్తున్నారని అంచనా. కాఫీ అనేది శక్తినిచ్చే, ఉత్తేజాన్నిచ్చే, ఆరోగ్యానికి మద్దతు నిచ్చే ప్రయోజనకరమైన పానీయం. స్కూల్స్ ఆఫ్ ది వైజ్‌గా ప్రపంచంలో మొట్టమొదటి మాయాపానీయంగా కాఫీ షాపు ప్రారంభమైనది. మక్కాలో వీటని కవేకేన్స్ అంటారు. ఇది అరబిక్ పదం నుండి వచ్చింది. ఇది వైన్‌లాగా చేదుగా, నల్లగా ఉండడంతో దీన్ని వైన్ ఆఫ్ రబీ అని అంటారు. కాఫీ చెట్లు 3-9 మీటర్ల ఎత్తువరకు జూలై, ఆగస్టు నెలలో పెరిగే పచ్చదనాన్ని కల్గిన చిన్నాచెట్టు. ఇది దాదాపు 100 సంవత్సరాలు జీవిస్తాయి. 7-20 సంవత్సరాల మధ్య అధిక ఉత్సాదక శక్తిని కల్గి ఉంటాయి. తెల్లని పూలు, ఆకు పచ్చని పండ్లని కలిగి ఉండే కాఫీ మొక్కని కాఫీ చెర్రీస్ అంటారు. సంత్సరానికి ఒక కాఫీ చెట్టు నుండి 2000-4000 కాఫీ బీన్స్ (10 పౌండ్లు) వస్తాయి. వీటిని మాగిన ఎర్రటికాఫీ చెర్రీస్ నుండి వేరుచేసి ఎండబెట్టి, వేడి చేసి, పొడిగొట్టి కాఫీ పౌడర్‌గా ఉపయోగిస్తారు. ఎర్రటి పండిన కాఫీ చెర్రీస్‌లో రెండు బీన్స్(కాఫీ గింజలు) ఉంటాయి. ఒక బీన్ అరుదుగా ఉంటే పీ బెర్రీ (స్పానిష్‌లో కారాకోల్/ నత్త) అంటారు. ఇవి తియ్యగా, రుచిగా ఉంటాయి.



**రకాలు :** వీటిలో 25-100 రకాల కాఫీ మొక్కలున్నాయి. వీటిలో ముఖ్యమైనవి 5 జాతులు అవి.

**కాఫీయా అరబికా :** ఇది 70% ఎత్తైన కొండ ప్రాంతాల్లో, వర్షపాతం అధికంగా ఉన్న ప్రాంతాల్లో పెరుగుతుంది. ఇవి ఎక్కువగా లాటిన్ అమెరికా, దక్షిణ ఈశాన్య ఉంటుంది. ఇది సర్వసాధార ణంగా పెరిగే మొక్క. **కాఫీయా రొబస్టా :** ఇది 30% దిగువ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో పెరుగుతుంది. ఇది అమెరికా, జపాన్, యూరోప్, బ్రెజిల్‌లో నుండి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడమైనది. సేంద్రీయ పద్ధతుల్లో గిరిజనుల చేత అరకులోయలో పండించిన కాఫీకి 'అరకు కాఫీ' అంటారు. వీటిలో కెఫిన్ కంటెంట్ 200చం ఉంటుంది.

**కాఫీయా లిబరికా :** దీన్నే లిబేరియన్ కాఫీ అంటారు. ఇది లెబేరియా, పశ్చిమ ఆఫ్రికా, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్ ఆసియాలో అరబికా, రోబస్టా కన్నా 20 మీటర్ల ఎత్తులో పెరిగే కాఫీ మొక్క. ఇది ఖరీదైనదే కాకుండా కెఫిన్ హటెంట్ చాలా తక్కువగా 1.23 గ్రా/100 గ్రా ఉంటుంది.

**కాఫీయా కానెఫోరా:** ఇది మధ్య, పశ్చిమ సహారా ఆఫ్రికాలో, టాంజానియా, బోర్నియో, జమైకా, అంగోలా, కోస్టారికా, బోర్నియోలో ఎక్కువగా పెరిగే సంకర జాతి మొక్క అని చెప్పబచ్చు. దీనిలో తక్కువ చక్కెర, 2.7% కెఫిన్ కల్గి ఉంటుంది.

**కాఫీయా ఎక్సెలా:** ఇది అరుదుగా 1903లో పశ్చిమ ఆఫ్రికాలోని సబ్‌ట్రోపికల్ ఏరియాలో ఉత్తర ఆసియాలో పెరిగే మొక్క. భారతదేశంలో నీడలో పండే అత్తుత్తమ భారతీయ కాఫీగా ప్రపంచ ఉత్పత్తిలో 4.5%గా, కాఫీ ఉత్పత్తిలో 7వ అతి పెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. మనదేశంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆస్సాం మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా పండిస్తారు. కాఫీలో ఉండే కెఫిన్ ఆల్కలాయిడ్ సైకోఆక్టివ్ డ్రగ్ అని చెప్పవచ్చు. ఒక కప్పు కాఫీలో 6 కేలరీలుండి రక్త ప్రవాహంలో 30-45 నిమిషాల్లో చేరు తాయి. కాలేయం ద్వారా జీవక్రియ చేయబడి మూత్రంద్వారా విసర్జింపబడు తుంది. 4-6 గంటల్లో దీని ప్రభావం పోతుంది. ఇది సెరిబ్రల్ వాస్కులార్ సిస్టమ్, దీని ప్రభావం పోతుంది. ఇది సెరిబ్రల్ వాస్కులార్ సిస్టమ్, రక్తపోటు, శ్వాసకోశ పనితీరు, గ్యాస్ట్రిక్, పెద్ద ప్రేగుకార్య కలాపాలు, కిడ్నీల పనితీరు, వ్యాయామంపై ఆధారపడి ఉంటాయి.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# కర్మ ఫలం

కౌండిన్య మహర్షి ఓసారి వైకుంఠానికి వెళ్లాడు. మార్గమధ్యంలో తాను చూపిన కొన్ని విచిత్ర దృశ్యాల గురించి శ్రీమహావిష్ణువు వద్ద ప్రస్తావించాడు. 'స్వామీ! ఒక మామిడిచెట్టు విరగ కాసింది. సమృద్ధిగా ఆకులు, ఫలాలున్నా దాని మీద ఒక్క పక్షీ లేదు. కొంత దూరం వచ్చాక ఓ ఆవు కనిపించింది. పచ్చని పొలంలో తిరుగాడుతూ కూడా.. అది గడ్డిని తినలేకపోతోంది. ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే గంతులేస్తున్న ఏనుగు, నేలపై దొర్లుతున్న గాడిద కనిపించాయి. వీటి అంతరార్థమేంటో బోధపడలేదు! మీరైనా చెప్పండి అన్నాడు. అప్పుడు ఆ వైకుంఠధాముడు మందహాసంతో మునివర్యా తమరు చూసిన మామిడి చెట్టు గత జన్మలో వేదవిద్వాంసుడు. అతడు పాండిత్యాన్ని తనవరకూ పరిమితం చేసుకున్నాడు. తన జ్ఞానాన్ని ఎవరితోనూ పంచుకోలేదు. అందుకే ఈ జన్మలో పక్షులువాలని చెట్టుగా మిగిలాడు. ఆ ఆవు పూర్వ జన్మలో బీడుభూమి ఎవరికీ ఉప యోగపడని కారణంగా, ఈ జన్మలో ఆకుపచ్చనిగడ్డి కళ్లెదురుగా ఉన్నా తినలేని దైన్యస్థితిలో ఉంది. ఏనుగు, గాడిదలు గతించిన జన్మలో విశృంఖల జీవనాన్ని గడిపిన ఉద్వేగ స్వభావులు. వారి తుంటరితనం, దుడుకు ప్రవర్తనల వల్ల ఈ జన్మలో ఇలా గంతులేస్తూ, రంకెలేస్తూ బతికాల్సి వచ్చింది. పరులకు ఉపయోగపడని జీవమైనా, జడ పదార్థమైనా కర్మఫలాల్ని అనుభవించాల్సిందే అని వివరించాడు.

# వంకాయ పచ్చడి



చింతపండు, ఆరేడు ఎండు మిరపకాయలు, చెంచా ఆవాలు, రెండు చెంచాల మినపప్పులను వేయించాలి. వంకాయలను ఒపయ్యి మీద అటూ ఇటూ తిప్పుతూ కాలానచలి. చల్లారనిచ్చి.. పొట్టు తీసేసి, లోపలి గుజ్జును మెత్తగా మెదపాలి. అందులో కాస్త బెల్లం పొడి కలపాలి. మేయించిన ఆవాలు, మినపప్పు, ఎండు మిరప కాయలకు చింతపండు, ఉప్పు జోడించి నూరి.. వంకాయ గుజ్జులో కలపాలి. ఇది మిక్సీ పట్టువచ్చు. కానీ రోట్లో చేస్తేనే మరింత రుచి. తర్వాత పోపు దినుసులు, కరివేపాకు, ఇంటువలతో తాలింపు వేయాలి. అంతే ఘుమఘుమలాడే కమనమలి వంకాయ పచ్చడి సిద్ధం. రుచినీ, ఆరోగ్యాన్నీ అందించే ఈ పచ్చడి ఎప్పుడైనా చేసుకోవచ్చు. అయితే భోగి, రథ సప్తమి, ఏకాదశి, షష్ఠి వంటి తిథుల్లో కొందరు తరిగిన కూరగాయలు తినరు. అటువంటి సందర్భాల్లో చేసుకోవడానికి ఇది సులవైన వంటకం.



# 'తత్వం' ట్రైలర్ విడుదల



కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్ష కుల్లో మంచి ఆదరణ ఉం టుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయ గలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుం టుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ల్ కలిగించే అంశా లతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఎగ్జిక్యూటివ్ నిర్మాత భరత్ మాట్లాడుతూ ట్రైలర్ అందరికి నచ్చింది. ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ కుదిరాయి. అందరూ ఈ సినిమా కోసం ఎంతో సపోర్ట్ చేశారు. అర్జున్ కోలా ఈ రోజు కోసం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నాడు. నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. మరో నిర్మాత శ్వేత పసుపులేటి మాట్లాడుతూ తత్వం టైటిల్‌కు తగ్గట్టుగా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఓ కొత్త సినిమాను చూశామన్నఅనుభూతికి లోనవ ౖతారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ ఈ మూవీ టైటిల్, కాన్సెప్ట్‌ను మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్నాను. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఓకే చేశాడు. హీరో దినేష్ తేజ్ మాట్లాడుతూ నేను కలిసి పనిచేయాలనుకున్న టెక్నిషియన్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేశాను. ఈసినిమాతో చాలా మంది కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. అందరం చాలా కష్టపడ్డాం. అది సినిమా చూసిన తరువాత అందరికి తెలుస్తుంది..

# 'రాజా ది రాజా' లవ్ సాంగ్ ఊహలే సాంగ్ రిలీజ్



యూత్ ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన 'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తు న్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ సెకండ్ సింగిల్ ఊహలే రిలీజ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ సాంగ్‌ని బ్యూటీఫుల్ లవ్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. కృష్ణకాంత్ (కేకే) రాసిన హృదయాన్నితాకే సాహిత్యం మరింత అందాన్ని తీసుకొచ్చింది. కార్తీక్, శ్వేతా మోహన్ తమ ప్లజెంట్ వోకల్స్‌తో పాటలోని ప్రేమ భావాలను ఎంతో ఆహ్లాద కరంగా ఆవిష్కరించారు. ఈ సాంగ్‌లో విజువల్స్ చాలా లావిష్‌గా వున్నాయి. రుత్విక్, విశాఖ ధీమన్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి రవికిరణ్ బోయిడపు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ కుమార్ పసుపులేటి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రంలో సాయికుమార్, డాక్టర్ నరేష్ విజయకృష్ణ, అవసరాల శ్రీనివాస్, విష్ణు ఓయి, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, బద్రం, మైమ్ మధు, ఆనంద్ తదితరు లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రాజా ది రాజా జూలై 17న విడుదల కానుంది.

# 'రావు బహదూర్'కు మహేష్ బాబు ప్రశంసలు



సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్'ను, సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ తమ GMB ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై, A+S మూవీస్ , శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సమర్పిస్తున్నారు. వెంకటేష్ మహా రచన, ఎడిటింగ్, దర్శకత్వం వహిం చిన ఈ సినిమా గ్లింప్స్, టీజర్, పాటలు ఇప్పటికే సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయిఈ కథను మొదటి సారి విన్నప్పటి నుండే మహేష్ బాబు 'రావు బహదూర్' పట్ల ఎంతో ఆసక్తిని, ఎమోషనల్ ఎటాచ్మెంట్‌ని పెంచుకున్నారు. కేవలం సమర్పకుడిగానే కాకుండా, సినిమా ఆలోచన దశ నుండి పూర్తయ్యే వరకు దాని క్రియేటివ్ ప్రయాణాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షి ంచారు. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచు కుంటూ, మహేష్ బాబు ఈ సినిమాను, రూపొం దించిన విధానాన్ని ప్రశంసించారు. (ట్విట్టర్)లో మహేష్ బాబు ఒక స్పెషల్ పోస్ట్ పెట్టారు "రావు బహదూర్... ఇది కేవలం ప్రేక్షకులను కట్టిపడేసే సినిమా మాత్రమే కాదు, వారి మనసులో లోతుగా ముద్ర వేసుకునే చిత్రం! విభిన్నంగా, అందంగా, ఇంటెన్స్ డ్రామాతో కూడిన సినిమా ఇది. దర్శకుడు వెంకటేష్ మహా ఒక అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించారు. వచ్చే వారం జూలై 3న విడుదల కానున్న ఈ చిత్రానికి మహేష్ బాబు మాటలు మరింత ఉత్సాహాన్ని, బలాన్ని చేకూరుస్తున్నాయి.



# 'ఇట్స్ లైఫ్ బ్రో' ఫస్ట్ లుక్ విడుదల

కేఎం (కృష్ణమోహన్), పూజా సుందర్‌శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ఇట్స్ లైఫ్ బ్రో'. కేఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సోమశేఖర్ రెడ్డి దర్శ కత్వంలో కృష్ణ మోహన్ సల్లగుండ్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎమోష నల్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రామిసింగ్ హీరో నితిన్ విడుదల చేశారు. దర్శ కుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ వైవిధ్య మైన కథ, కథనాలతో ఎమోషనల్ లవ్‌స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రం అందరి హృదయాలకు హత్తుకునే విధంగా ఉంటుంది. కృష్ణ మోహన్, పూజా సుందర్ శెట్టి, రాజీవ్ కనకాల, చమ్మక్ చంద్ర, అంబటి శ్రీనివాస్, దేవి ప్రసాద్, కిరీటి, త్రిశూల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే: ఇ.రాజయ్య. డీఓపీ: చైతన్య, సంగీతం: సాహిత్య సాగర్, ఎడిటర్: సత్య గిద్దుటూరి

# ఖుష్బూ కూతురి పెళ్లిలో ఖుషీ.. ఖుషీగా !

## టాలీవుడ్.. బాలీవుడ్ సీనియర్లంతా అక్కడే !



ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆమె పెద్ద కుమార్తె అవంతిక వివాహం గోవాలో అత్యంత వైభవంగా జరిగింది. చెన్నైకి చెందిన వ్యాపార వేత్త శ్రవణ్ శ్రీనివాసన్‌తో అవంతిక వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. గోవాలోని ఒక విలాస వంతమైన రిసార్ట్‌లో జరిగిన ఈ వేడుకకు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వివాహ వేడుకలో టాలీవుడ్ సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ముగ్గురు కథానాయకులు తమ సతీమణులు సురేఖ, అమల, నీరజలతో కలిసి హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన ఈ తారలంతా నూతన దంపతులతో ఫొటోలు దిగి సందడి చేశారు. వీరితో పాటు బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, నటి త్రిష కూడా ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. దీంతో 80, 90ల నాటి తారలంతా ఒకే చోట చేరిన అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఖుష్బూకు టాలీవుడ్‌లోని ఈ ముగ్గురు అగ్ర హీరోలతో మంచి అనుబంధం ఉంది. 'కలియుగ పాండవులు' చిత్రంతో వెంకటేశ్, ఖుష్బూ ఇద్దరూ దాదాపు ఒకే సమ యంలో కెరీర్ ప్రారంభిం చారు. ఆ తర్వాత నాగార్జునతో 'కెప్టెన్ నాగార్జున' చిత్రంలో ఆమె హీరో యిన్‌గా నటిం చారు. ఇక, చిరంజీవి నటించిన 'స్టాలిన్' సినిమాలో ఖుష్బూ ఆయనకు సోదరిగా కీలక పాత్ర పోషించారు. వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా వీరందరి మధ్య స్నేహబంధం కొనసాగుతోంది. వెండి తెరపై ఒకరితో ఒకరు పోటీ పడినా, నిజ జీవితంలో మంచి స్నేహితులుగా మెలిగే చిరు, నాగ్, వెంకీ.. తమ స్నేహితురాలి కుమార్తె వివాహంలో ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# 'తెల్ల కాగితం' మెలోడీ గీతం విడుదల



'తెల్ల కాగితం' నుంచి మెలోడీ గీతం విడుదల.. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' అంటూ యంగ్ అండ్ టాలెంట్ నటుడు హర్ష్ రోషన్ వరుస విజయాలతో దూసుకుపోతోన్నారు. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా 'తెల్ల కాగితం' అనే చిత్రంతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మాణంలో రమేష్ బండ్రెడ్డి ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్‌లు, ఇతర కంటెంట్ సినిమా మీద అంచనాల్ని పెంచేసింది. "చిలకా"అంటూ సాగే ఈ పాటకు పూర్ణాచారి సాహిత్యం, అనురాగ్ కులకర్ణి గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక విజయ్ బుల్గానిన్ బాణీ అయితే ఎంతో వినసొంపుగా ఉంది. ఈ చిత్రానికి ప్రతిభావంతుడైన రచయిత నందు సవిరిగన కథను అందించారు. 'సమజవరగమన' మరియు 'నారి నారి నడుమ మురారి' వంటి విజయవంతమైన చిత్రాలకు సహరచయితగా పనిచేసి ఆయన మంచి గుర్తింపు పొందారు.



# 'మా ఇంటి బంగారం' రెస్పాన్స్‌తో హ్యాపీ: సమంత

ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా "మా ఇంటి బంగారం". సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ సినిమా జూన్ 19న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజై బ్లాక్ బస్టర్ అయ్యింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ థాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. సమంత మాట్లాడుతూ మా ఇంటి బంగారం సినిమాకు వస్తోన్న రెస్పాన్స్ చూసిన తర్వాత చాలా సంతోషంగా అనిపించింది. నాకు సింక్ కాలేదు. దీన్నే ప్రతి ఆర్టిస్ట్ కోరుకుంటారు. ప్రతి సినిమాతో బెటర్ కావాలి. పెర్ఫామెన్స్ బెటర్ కావాలని డ్రీమ్‌లాగా భావి స్తారు. ఈవిషయంలో నేను చాలా లక్కీగా భావిస్తాను. థియేటర్స్‌లో సినిమాను చూస్తుంటే సర్‌ప్రైజింగ్‌గా ఉంది. డైరెక్టర్ నందినీ రెడ్డి మాట్లాడుతూ రాజ్ కథను డిజైన్ చేసినప్పుడే అన్నీ వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఎలిమెంట్స్ ఉండాలనే ఆలోచనతో చేశారు. సమంత సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా పెట్టుకుని డిజైన్ చేశారు. సమంత ఎప్పటికీ స్పెషల్.. రాజ్‌గారు యాడ్ కావటం ఇంకా బలమైంది. ఓ బేబి సినిమా తర్వాత సమంత తో నేను చేసిన సినిమా. ఆమెలో కొత్త డైమన్షన్‌ను ఇందులో చూస్తారు. నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ మేం హిందీలో ఫ్యామిలీ మ్యాన్, స్త్రీ వంటి సబ్జెక్ట్స్‌ను ప్రేక్షకులకు అందించాం. అయితే మా ఇంటి బంగారం సినిమాకు వచ్చినంత రెస్పాన్స్ ఎక్కడా రాలేదు. మా వాళ్లంతా ఇప్పుడు నిద్ర లేచి.. ఎంత బాగా తీశావురా! అన్నారు. .

# 'సర్' పర్యవేక్షణకు పార్లమెంట్‌వారీగా కంట్రోల్‌రూమ్ కోఆర్డినేటర్లు

## ఎస్ఐఆర్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా పులిపాటి రాజేష్‌కుమార్

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి, ఎస్ ఐఆర్ కోర్డినేషన్ కమిటీ చైర్మన్, కోఆర్డినేటర్‌తోపాటు పార్లమెంట్ నియోజక వర్గాల కంట్రోల్ రూమ్ కోఆర్డినేటర్లను నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. ఎలక్షన్ కమిషన్‌తో అనుసంధానం కోసం పిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గాపులిపాటి రాజేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పరిపాలనాపరంగా గంప వేణుగోపాల్‌ను కోఆర్డినేటర్‌గా నియమించారు.

తెలంగాణలోని పదిహేడు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కంట్రోల్ రూమ్ కోఆర్డినేటర్లను నియమించడంతోపాటు కంట్రో ల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. అదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గానికి కోల్కొండ సంతోష్ పెద్దపల్లి కి శశి భూషణ్ కాచే, కరీంనగర్‌కు డాక్టర్ మద్దెల సంతోష్ కుమార్ నిజామాబాద్‌కు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,జహీరాబాద్ పార్లమెంట్‌కు డాక్టరు జూలూరు ధనలక్ష్మి. మెదక్ పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా జీ.వి. వెన్నెల,మల్కాజిగిరికి సుబ్రహ్మణ్య పొన్నాడ, సికింద్రాబాద్‌కు ఎం. రాఘవేంద్ర రెడ్డి. హైదరాబాద్ అచ్యుత యాదవ్. చేవెళ్లకు ఎస్. జగదీశ్వర్ రావు,మహబూబ్నగర్ టి. రేవతి గౌడ్, నాగర్ కర్నూల్‌కు ఒబేదుల్లా కోత్వాల్, నల్గొండ కస్బా శ్రీనివాసరావు, భువనగిరి డాక్టర్ బైకినీ లింగం యాదవ్ వరంగల్ పీర్ ఇర్షద్ అహ్మద్ నాసిర్, మహబూబాబాద్, నూతి శ్రీకాంత్ గౌడ్, ఖమ్మం గోపిశెట్టి రాఘవేందర్‌లను నియమించారు. ఈ కమిటీ సభ్యులు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బూత్ స్థాయి బిఎల్‌ఏ ల నుండి అసెంబ్లీ, పార్లమెంట్ నాయకులతో మాట్లాడుతూ ఏమన్నా సమస్యలు ఉంటే ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేటట్టు చూడటం జరుగుతుంది. టిపిసిసిసి ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ ఈనెల రోజులు పార్లమెంట్ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకొని అర్హులైన ఓటర్లను ఎవరిని కూడా జాబితా నుంచి తొలగించకుండా చూడాలని టిపిసిసి చీఫ్ తెలిపారు.

# డ్రగ్స్ బారినపడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

## డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), జూన్ 26, ప్రభాతవార్త:** విలువైన జీవితాన్ని డ్రగ్స్ భారినపడిన నాశనం చేసుకోవద్దని తెలంగాణ డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క యువతరానికి సూచించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్ స యాంటి డ్రగ్ అవగాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారని,ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నం చేస్తుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ జీవితాలను రిస్కులో పెట్టి డ్రగ్ స ముఠాలను పట్టుకుంటున్నారన్నారు. ఈ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. ఈగల్ ఫోర్ స సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించామన్నారు. డ్రగ్ స కట్టడికి ఏలాంటి కఠిన నిర్ణమైనా తీసుకుంటామన్నారు.తెలంగాణలో పుట్టి పెరగటం ఓ బరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నామన్నారు. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యమన్నారు. సినీనటులు ఇచ్చే సందేశం సమాజంలోనికి బలంగా వెళుతుందని బట్టి విక్రమార్క అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్,డీజీపీ సీవీ ఆనంద్,సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి తదితరులు

### రామజన్మభూమి తీర్థట్రస్ట్ అవినీతికి బాధ్యత వహించి

# యుపి సిఎం రాజీనామా చేయాలి

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రామజన్మభూమి తీర్థట్రస్ట్ అవి నీతికి బాధ్యత వహించి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ రాజీనామాచేయాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకనటలో డిమాండ్ చేశారు. అయోధ్య రామ జన్మ భూమి తీర్థ ట్రస్ట్ కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారు కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్‌రాయ్ మనుషులను అరెస్టు చేశారనీ చామల ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల సెంటి మెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలుచేసి వాటితో రాజకీయ ప్రయోజనాలు బిజెపి తీర్చుకొందని ఆయన ఆరోపించారు. యూపీ సీఎం పదవికి యోగీ ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. అయోధ్య రామజన్మ భూమి ట్రస్ట్ పేరుతో 200 కోట్లు అవినీతిచేసి వాటిని బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్దవ్ థాక్రే ఎంపీలు 6 మందిని ఒక్కొక్కరికి 75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందని ఆరోపించారు.

# రాష్ట్రంలో లార్జ్ ట్యాక్స్ పేయర్స్ యూనిట్ ఏర్పాటు

## వాణిజ్య పన్నుల శాఖలో సంస్కరణలు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** పన్నుల వసూళ్లను మరింత పగడ్బందీగా పెంచేందుకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ పలు చర్యలు చేపట్టింది. వాణిజ్య పన్నుల శాఖ లో సంస్కరణలు చేపడుతూ అధికారులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయంలో 'స్టేట్ లార్జ్ ట్యాక్స్ పేయర్స్ యూనిట్' ను ఏర్పాటు చేసి తద్వారా పన్నుల వసూళ్లలో లీకులు లేకుండా చూడనున్నారు. పన్నుల వసూళ్లను మరింత సమర్థంగా పర్యవేక్షించేందుకు, భారీగా పన్నులు చెల్లించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచనుంది. అలాగే పేయర్స్ యూనిట్ ఏర్పాటుకు అనుగుణంగా వాణిజ్య పన్నుల శాఖను 19 డివిజన్లు, 121 సరిళ్లుగా పునర్వ్యవస్థీకరిస్తూ అధికారులు నప్రతిపాదనలకు కార్యారణను అమలు చేస్తున్నారు. డివిజన్ స్థాయిలో ప్రత్యేక పన్ను చెల్లింపుదారుల విభాగం ద్వారా అగ్రశ్రేణి పన్ను చెల్లింపుదారులను పర్యవేక్షిస్తున్నప్పటికీ, రాష్ట్రస్థాయిలో ఇలాంటి సమగ్రమైన వ్యవస్థ ఇప్పటివరకు లేదు. నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా పన్ను చెల్లింపుదారులను రాష్ట్రస్థాయి ఎల్‌టీయూ పరిధిలోకి తీసుకొస్తారు. ఈ విభాగానికి జాయింట్ కమిషనర్ లేదా అడిషనల్ కమిషనర్ హోదా గల అధికారి నేతృత్వం వహిస్తారు.

యేటా నిర్దేశిత మొత్తం కంటే ఎకువ ఎస్‌జీఎస్టీ రెవెన్యూ అందించే అగ్రశ్రేణి పన్ను చెల్లింపుదారులు ఈ యూనిట్ పరిధిలోకి రానున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. అన్ని రకాల జీఎస్టీ చట్టాల కింద ఏటా నిర్దేశిత పరిమితికి మించి రీఫండ్లు పొందే వ్యాపారులతోపాటు పెట్రోలియం ఉత్పత్తులు, మానవ వినియోగానికి ఉపయోగించే మద్యం వంటి నాన్‌జీఎస్టీ వస్తువుల వ్యాపారం చేస్తూ వ్యాట్ చట్టం కింద భారీగా పన్నులు చెల్లించే ప్రముఖులు కొత్త విభాగం పరిధిలోకి వస్తారు.

# పిసిసి ఉపాధ్యక్షుడు జగదీశ్

# పాస్‌పోర్టు పౌరసత్వం కాకపోతే బిజెపి మెంబర్‌షిప్ పౌరసత్వమా?

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** పాస్‌పోర్టు పౌరసత్వం ధృవీకరణ కాకపోతే బిజెపి సభ్యత్వం భారతీయుడిగా గుర్తింపుకు ఉపయోగపడుతోందా అని టిపిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్ ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో సంగిశెట్టి జగదీష్ మాట్లాడుతూ బిజెపి రాజకీయాధికారం కోసం రాముడి గుడి చందాలను కూడా చోరీ చేస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు బిజెపి ఓటుచోరీ, ఇవిఎంలో డాటాచోరీ, సీటుచోరీ, పార్టీ చోరీ వంటి ఎత్తుగడలతో దేశంలో ప్రజా స్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తూ వచ్చిందని ఇక బహుళపార్టీ వ్యవస్థను కూడా లేకుండా కేవలం ఏకపార్టీ వ్యవస్థను తీసుకొచ్చి నియంతృత్వంవైపు తీసుకెళ్ళుతుందని ఇది దేశానికి క్షేమం కాదని ఆయన వివరించారు. ప్రస్తుతం జరిగే సర్ ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలనీ ఓటెతో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు రాజ్యాంగం మనకి కల్పించిందనీ ఆయన



గుర్తుచేశారు. పాస్పోర్ట్ అనేది కూడా సిటిజెన్ షిప్ కాదు అంటున్నారూ బిజెపి మెంబెర్ షిప్ ఉంటేనే సిటిజెన్ గా కన్సిడర్ చేస్తారేమో అని ఎద్దేవా చేశారు. ఇతర రాష్ట్రాల లో సర్ పేరుతో బిజెపి ఎలా అధికారం లోకి వస్తుందో మనం చూసాం అని భయాందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 8 సార్లు సర్ ప్రక్రియ జరి గిందనీ ఆయన తెలిపారు. దేశంలో తెలంగాణ మా టార్గెట్ అని బిజెపి నేతలు మాట్లాడుతున్నారనీ ఓట్ అప్లై చేసుకోవటంతోపాటు 2002 నాడు ఎక్కడ ఓటు వేశారో ఆ వివరాలు బిఎల్ ఒలకు అందించాలని ఇది ప్రజాస్వామ్య ప్రక్రియ కాపాడుకొనే బాధ్యతగా మనం తీసుకోవాలని ఆయన కోరారు., అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనీ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంను పరిరక్షణ చేసుకొనాల్సి న అవసరం ఉందని తెలిపారు.

# కెసిఆర్ మౌనం.. గోడకు వేలాడుతున్న తుపాకీ

## జగన్ బంగీ జంప్‌పై కెటిఆర్ సరదా వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ఒక టెలివిజన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ, గతంలో జగన్ చేసిన బంగీ జంప్ గురించి ప్రస్తావించారు. తనకు సాహసకృత్యాలంటే ఇష్టమని, భవిష్యత్తులో స్కైడైవింగ్ చేయాలని ఉందని, అయితే బంగీ జంప్ అంటే మాత్రం ఎంతో భయమని ఆయన వెల్లడించారు. కేవలం ఒకే తాడుపై ఆధారపడి కిందకు దూకడం చాలా భయానకంగా అనిపిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జగన్ చేసిన బంగీ జంప్ అంశాన్ని గుర్తుచేసుకుంటూ, 'అది జగన్‌కు ఎలా సాధ్యమైందో నాకు అర్థం కావడం లేదు. ఆయన్ను కలిసినప్పుడు దీని గురించి తప్పకుండా అడుగుతాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ప్యారాచూట్ సహాయంతో చేసే స్కై డైవింగ్ కంటే బంగీజంప్ క్లిష్టమని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదే ఇంటర్వ్యూలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవలి మోనంపై కూడా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ మోనాన్ని 'గోడకు వేలాడుతున్న తుపాకీ'తో ఆయన పోల్చారు. సమయం వచ్చినప్పుడు అది తప్పకుండా గర్జిస్తుందని, ప్రస్తుతం ఆయన మార్గదర్శకత్వంలోనే తామంతా ముందుకు సాగుతున్నామన్నారు.

# అంగన్‌వాడీ నియామకాలను అడ్డుకోవడానికి మంత్రి సీతక్కపై అసత్య ప్రచారం

## కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** అంగన్వాడీ నియామకాల్లో ఇంటర్వ్యూల విధానంపై బిఆర్ఎస్ మహిళా నాయకులు చేస్తున్న అసత్య ప్రచారంపై కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ తీవ్ర స్థాయిలో ధ్వజ మెత్తారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే, నియామకాలను అడ్డుకునే కుట్రతోనే మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. మంత్రి సీతక్కకు ప్రజల్లో వస్తున్న ఆదరణను తట్టులేక అక్కసుతో నిరాధారమైన ఆరోపణలు చేయడం నిజంగా సిగ్గుచేటన్నారు. మరోసారి సీతక్కపై ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన బుద్ధి చెప్తామని ఆమె హెచ్చరించారు.అంగన్వాడీ అనేది కేవలం ఒక ఉద్యోగం కాదని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక అభ్యాసం వంటి కీలక బాధ్యతలను నిర్వహించే గొప్ప సేవ అని ఇందిరాశోభన్ కొనియాడారు.

అభ్యర్థి వ్యవహారశైలి, మానసిక పరిపక్వత, పిల్లల పట్ల సున్నితత్వం వంటి అంశాలను తెలుసుకోవడానికే ప్రజా ప్రభుత్వం ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టిందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ విధానం ఇప్పటికే అమల్లో ఉందని ఆమె గుర్తు చేశారు. గతంలో కొన్నిచోట్ల చిన్నారుల పట్ల అనుచితంగా వ్యవహరించిన ఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకోవడమే కాంగ్రెస్ సర్కార్ ప్రధాన ఉద్దేశమన్నారు. బిఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నట్లుగా ఇంటర్వ్యూల ఆధారంగా మాత్రమే నియామకాలు జరగవని, అభ్యర్థి సాధించే మొత్తం మార్కుల్లో 90 శాతం వారి విద్యార్హతలు, ఇతర సామాజిక అర్హతల ఆధారంగానే ఉంటాయని ఇందిరాశోభాన్ తెలిపారు. ఇంటర్వ్యూలలో ఏ ఒక్క అధికారి ఇష్టానుసారం మార్కులు వేయడానికి వీల్లేదని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే ప్రత్యేక కమిటీ ఈ ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థుల నైపుణ్యాలను పరిశీలించి కేవలం 10 శాతం మార్కులు మాత్రమే ఈ కమిటీ కేటాయిస్తుందన్నారు. అభ్యర్థుల నైపుణ్యాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఇంటర్వ్యూలు పెడితే బీఆర్ఎస్ నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఇందిరాశోభన్ మండిపడ్డారు

# అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

## మంత్రి దామోదర రాజనర్సింహకు టిజిఒ డాక్టర్స్ ఫోరం విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** మెడికల్ కాలేజీలు, బోధనా స్పత్రుల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టిజివో) డాక్టర్స్ ఫోరమ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు డాక్టర్స్ ఫోరమ్ నేతలు శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టిజివో) అసోసియేషన్ డాక్టర్స్ ఫోరం ప్రతి నిధులు వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను కలిసి మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న మెడికల్ అండ్ హెల్త్ ఉద్యో గులకు రిక్వెస్ట్ బదిలీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రులలో పనిచేస్తున్న ఫ్యాకల్టీ రిటైర్మెంట్ వయస్సును పెంచకుండా 65 సంవత్సరాలకే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు. దాంతోపాటు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్స్‌గా ప్రమోషన్లను త్వరగా చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్టు డాక్టర్స్ ఫోరమ్ అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్ధన్ తెలిపారు. తాము మంత్రి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ముఖ్యమంత్రితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని డాక్టర్ కత్తి జనార్దన్ తెలిపారు.

# విద్యా శాఖ మంత్రిగా రేవంత్ ఫెయిల్

## బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, జీవన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** నిరుద్యోగులను సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆగం చేస్తోందని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ఆరోపించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోందని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదల చేయడం లేదని, బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో రేవంత్ చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. జీవో9 లోని 4 నిబంధనల అమలును హైకోర్టు నిలిపివేసిందని, విద్యార్థుల చదువుపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదా? అని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రిగా రేవంత్ ఫెయిల్ అని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని మాజీ సిఎం కెసిఆర్ కొనసాగించారని కొనియాడారు. 30 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయలేదని, విద్యార్థులు సర్టిఫికెట్లు కూడా పొందలేకపోతున్నారని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రూ.10 వేల కోట్లు బకాయిలు పడ్డదని, ప్రభుత్వం ఫీజు చెల్లించకుండా జీవో నెం.9ని తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఆర్థిక స్థోమత లేకనే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకమని, విద్యార్థులే ఫీజు చెల్లించుకుంటే ప్రభుత్వం ఎందుకు? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుందో..లేదో తెలియదు కానీ విద్యార్థులు మాత్రం ఫీజు చెల్లించాల్సి వస్తుందని, కెసిఆర్ పై కోపంతో పథకాలు నిలిపివేస్తే రాష్ట్రం నష్టపోతుందని, జివో నెం.9ని ప్రభుత్వం రద్దు చేయాలని జీవన్‌రెడ్డి కోరారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా 'ప్రైవేటు' పైచర్యలు చేపట్టాలి

## ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ బోధన ప్రమాణాలు పాటించడంలో ఉండాలి:

## ఎమ్మెల్సీ విజయశాంతి డిమాండ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించని ప్రైవేటు కళాశాలపై విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టి బోధనా ప్రమాణాలు పెంచుకొనేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ విజయశాంతి డిమాండ్ చేశారు. తెలంగాణ లోని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఫీజుల వసూళ్లపై చూపే శ్రద్ధను, విద్యా సంస్థల నిర్వహణలో కనీప్రమాణాలు పాటించడంలో కూడా చూపాలని ఆమె హితవు చెప్పారు. రాష్ట్రంలోని ప్రైవేట్ కాలేజీలకు ఫీజు రియంబర్స్ మెంట్ కింద ప్రభుత్వం చెల్లించాల్సి న బకాయిలను విడుదల చేయాలంటూ హైకోర్టు ఇటీవల జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సానుకూల నిర్ణయం తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కోర్టుకు తెలపడం హర్షణీయమని విజయశాంతి పేర్కొన్నారు. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడంలో తప్పులేదని, కానీ దానికి తగ్గట్టుగా కాలేజీల్లో సరైన వసతులు, నాణ్యమైన విద్యా ప్రమా ణాలు కల్పించాల్సి న బాధ్యత కూడా వారిపైనే ఉంటుందని విజయ శాంతి స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలోని చాలా ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించడం లేదని, కనీస సదుపాయాలు కూడా కల్పించడం లేదని విజిలెన్స్ కమిషన్ విచారణలో తేలిందని ఆమె గుర్తుచేశారు. ఈ మేరకు విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక కూడా సమర్పించిందన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం జులై 2న కాలేజీల బంద్

## బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం చేయాలనుకున్న పనిని కోర్టుల ద్వారా చేపిస్తుందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌ను రద్దు చేయాలని కుట్రలకు నిరసనగా జూలై 2న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్‌ను చేపట్టనున్నట్టు తెలిపారు. పథకం పకడ్బందీగా అమలు చేయడం కోసం జూలై 15న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వెరిక సురేష్ ఆధ్వర్యంలో బిసి విద్యార్థి, యువజన సంఘాల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశం అనంతరం జరిగిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై గురువారం రాష్ట్ర హైకోర్టు విద్యార్థుల నుంచి ఫీజులను కళాశాలలు వసూలు చేసుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని, విద్యార్థులకు వ్యతిరేకంగా కోర్టు తీర్పులు రావడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయాలని గత రెండు సంవత్సరాలుగా కుట్ర చేస్తుందని, అందులో భాగంగానే రూ. 7000 కోట్ల ఫీజుల బకాయిలు చెల్లించకుండా నాన్చివేత దొరణి అవలంబిస్తుందన్నారు. ఫీజు బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో అనివార్యంగా కాలేజీ యజమాన్యాలు కోర్టుల్లో కేసులు వేశారని, కోర్టుల్లో ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాల్సి ఉన్నప్పటికీ "రోగి కోరుకున్నది, డాక్టర్ ఇచ్చిన మందు అదే" అన్నట్టు ప్రభుత్వం చేయాలనుకున్న రద్దును కోర్టు తీర్పుల ద్వారా పరోక్షంగా చేపిస్తుందని జాజుల మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తల తోక లేకుండా విద్యార్థి వ్యతిరేక భావంతో జీవో నెంబర్ 7, 8, 9 లను తీసుకువచ్చి రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర గందరగోళానికి గురి చేసిందన్నారు.

# బొగ్గు మాయంపై హరీశ్ ఆరోపణలు అసత్యం

## ఆరోపణలకు సమాధానం చెప్పాలి

## సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 15 నుంచి సమ్మె

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** సింగరేణికి సంబంధించిన విష యాలపై బిఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు తనపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేస్తున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాం బశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని హరీశ్‌రావు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్య మని, ఒక్క బొగ్గు పెల్ల కూడా దొంగతనం జరిగే అవకాశం లేదని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివ రావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి కె.రాజ్ ఇటీవలి కాలంలో సింగరేణిలో జరుగుతున్న పరిణామాలపై మాట్లాడారు. సింగరేణిలో ఇప్పుడు స్కామ్ జరిగింది అంటే బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 75 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఎక్కువ చూపించారని, అప్పుడు కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఇప్పుడు బిఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న దాసోజు శ్రవణ్‌కుమార్ 2017లో టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 75 లక్షల టన్నుల బొగ్గు ఎక్కువగా ఉన్నదని చూపెట్టారని 'ఇది సత్యం స్కాం లాంటి'దని ఆనాటి కేంద్ర విజిలెన్స్ కమిషన్ కే చౌదరికి ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. హరీశ్‌రావు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరైందికాదని, ఆయన అసత్యాలు చెప్పడం మానేసి, బొగ్గు నిల్వలపై అనుమానం ఉంటే సిబిఐ విచారణ కోరవచ్చని సాంబశివరావు సూచించారు. టిజిబికెఎస్ యూనియన్ పంచాయతీ కోసం సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బ తీయొద్దన్నారు. సింగరేణిలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 15 నుంచి సమ్మెకు పిలుపునిస్తామని సంస్థను హెచ్చరించినట్లు సాంబశివరావు వెల్లడించారు.

# 30న తరగతుల బహిష్కరణ.. కలెక్టరేట్ల ముట్టడి

## ఫీజు రీయింబర్స్‌మెంట్ యధాతథంగా అమలుచేయాలి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని యథాతథంగా కొనసాగించి, విద్యార్థులకు సంబంధించిన రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బహిష్కరణతోపాటు కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎంఆర్వో కార్యాలయాల ముట్టడికి 14 బీసీ సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు విద్యా సర్టిఫికెట్లు పొందలేక ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో 18 యేళ్లుగా అమలవుతున్న విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. అరుణ్‌కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ తదితర 14 బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నెలాఖరులోగా రైతు డిస్కంకు లైసెన్స్

## విద్యుత్ నియంత్రణ కమిషన్ కసరత్తు పూర్తి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ, రైతాంగంతో పాటు, ఉచిత విద్యుత్ అందిస్తున్న వివిధ విభాగాలకు సంబంధించి మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించే లక్ష్యంతో ప్రతిపాదిత ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చివరిదశకు చేరింది. ఈ నూతన విద్యుత్ పంపిణీ సంస్థ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు అత్యంత కీలకమైన లైసెన్స్ జారీకి రంగం సిద్ధమైంది. రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ కమిషన్ ఈ లైసెన్స్ జారీకి అవసరమైన విధివిధానాలపై ప్రస్తుతం చేస్తున్న కసరత్తు పూర్తయింది.

కొత్తగా ఏర్పడనున్న ఈ ఉచిత డిస్కంకు అధికారిక హోదా దక్కాలంటే నియంత్రణ కమిషన్ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో లైసెన్స్ మంజూరు కోసం అధికారులు గత మార్చి 19వ తేదీన దరఖాస్తు సమర్పించారు. నిబంధనల ప్రకారం నూతన సంస్థ ఏర్పాటుపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలను నియంత్రణ కమిషన్ ఆహ్వానించింది . ఇందులో భాగంగా మే 29వ తేదీన ఒక బహిరంగ విచారణ కూడా నిర్వహించింది. ఈ విచారణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలకు ఉపక్రమించింది.

ఇందులో భాగంగా రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ పంపిణీ బాధ్యతలు చూస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ల లైసెన్సుల్లో పలు మార్పులు చేయాల్సి ఉంటుంది.

దీని నిమిత్తం వాటి అధికార పరిధిని సవరించడానికి సంబంధించి ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతూ అభ్యంతరాలు, సూచనలు సమర్పించేందుకు గడువు ఈ నెల 22తో ముగిసింది.

ఈ ప్రక్రియలో మొత్తం నాలుగు అభ్యంతరాలు, మరికొన్ని సూచనలు ఈఆర్‌సీకి అందాయి. ప్రస్తుతం అధికారులు వాటిని పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలన పూర్తయిన వెంటనే రైతు డిస్కం ఏర్పాటుకు అవసరమైన లైసెన్స్‌ను మంజూరు చేస్తూ ఈఆర్‌సీ తుది ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

లైసెన్స్ మంజూరుతో పాటు ప్రస్తుత డిస్కంల పరిధిలో కీలక మార్పులు జరగనున్నాయి. సాధారణ గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు మినహాయించి ప్రభుత్వ సబ్సిడీలతో నడిచే పలు కనెక్షన్లను కొత్త సంస్థకు బదిలీ చేస్తారు.

వాటిల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో పాటు భారీ, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన కనెక్షన్లు, ఇంటింటికీ తాగునీరు అందించే మిషన్ భగీరథ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లు, ఇతర ప్రభుత్వ, మున్సిపల్ తాగునీటి సరఫరా పథకాల కనెక్షన్లు ఉండనున్నాయి. ఈ కనెక్షన్లన్నింటినీ ప్రస్తుతమున్న రెండు డిస్కంల పరిధి నుంచి పూర్తిగా తొలగించి వాటిని ఉచిత డిస్కం పరిధిలోకి మారుస్తారు. ఔఈ బదలీ ప్రక్రియ అంతా పూర్తి చేసి ఈఆర్‌సీ లైసెన్స్ జారీ చేసిన తదుపరి ఈ కనెక్షన్లకు నిరంతర విద్యుత్ సరఫరా చేసే చట్టబద్ధమైన అధికారం ఈ కొత్త డిస్కంకు లభిస్తుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

# నానిపై వైసీపీ బురద జెల్లె ప్రయత్నం చేస్తున్నారు




## - తిరుపతి టిడిపి రూరల్ పార్టీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి

**తిరుపతి హెల్త్, జూన్ 26 ప్రభాతవార్త:**

వైసిపి నాయకులు అవిలాల పంచాయతీలో కోట్లల్లో భూమి విలువందని, అంకణం వేళల్లో ఉందని మాట్లాడడం మంచి పద్ధతి కాదని తిరుపతి రూరల్ పార్టీ టిడిపి అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి మోహిత్ రెడ్డిని హెచ్చరించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాళ్ళ నాన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్టును కొడుకు మోహిత్ రెడ్డి చదువుతున్నాడని, భవిష్యత్తు వున్నవ్యక్తి మోహిత్ రెడ్డి అని,నిజాలు తెలుసుకొని ఆరోపణలు చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ మీటింగ్లో ప్రజలకు భోజనాలు పెట్టలేదని ఆరోపించడం మంచిది కాదని, మోహిత్ రెడ్డి ప్రత్యక్షంగా గాని, మారువేషంలో కానీ,టిడిపి మీటింగులకు వచ్చి భోజనం చేసి వెళ్ళితే తెలుస్తుంది అన్నారు. పులివర్తి నాని చంద్రగిరి శాసన సభ్యులుగా ఎన్నికైనప్పటినుంచి కంటిన్యూగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయని, వాటిని చూసి ఓర్వలేక నాని పైన వైసిపి నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో మీలాగా దిమ్మెలు వేసి,దిమ్మెలకు పేర్లు వేసుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సిస్టం ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. ఎమ్మార్వో, కలెక్టర్, ఆర్డిఓ లను బెదిరించడం, రెచ్చగొట్టడం మానుకోవాలని,నీవు తుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో ఎంత అవినీతి జరిగిందో సిట్ నివేదికలో తొందరలోనే పట్టబయలు అవుతుందని, నీ అవినీతికి సహకరించిన అధికారులు, పార్టీ నాయకులు,ఎంతమంది వీధిన పడతో, వారి పాపం నీదే అన్నారు. చంద్రగిరిలో సర్ కార్యక్రమం బాగా జరుగుతున్నదని, గత ఎలక్షన్లలో దొంగ ఓట్లను చేర్చిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,దొంగ ఓట్లు అన్ని తొలగించబడతాయని, ఆ అక్కసుతోనే అధికారులు పైన ఆరోపణలు చేస్తున్నాడు మోహిత్‌రెడ్డి అని ఆరోపించారు. బిజెపి కన్వీనర్ మదసాని పురుషోత్తం నాయుడుని పులివర్తి నాని మట్టి తోలుకోవడం ఆపినప్పుడే నాని చెడ్డవాడని తెలిసిందా నీవు మట్టి తోలినప్పుడు నాని మంచివాడుగా ఎలా అయ్యాడో చెప్పాలన్నారు. వైసిపి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి తొత్తుగా పురుషోత్తం నాయుడు వ్యవహరిస్తున్నాడని, సర్వేనెంబర్ 2లో కాలువ పక్కన 50 సెంట్లు, 4.2 నాది నా భూమి నీ ఆక్రమణలో లేదా అని ప్రశ్నించారు. పురుషోత్తం నాయుడు నాకు మట్టి తోలుకున్నందుకు డబ్బులు ఇవ్వలేదని, ఎలక్షన్ ముందు నా దగ్గర అప్పు తీసుకున్నాడని ఈశ్వర్‌రెడ్డి అన్నారు. గణపతి నాయుడు మాట్లాడుతూ మోహిత్‌రెడ్డి నానిపై చేసిన నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నామని,రాత్రికి రాత్రే రికార్డులు మార్చడానికి ఉన్నది వైసీపీ ప్రభుత్వం కాదని, టిడిపి ప్రభుత్వం అని గుర్తించుకోవాలన్నారు. గతంలో లాగా ప్రతిపక్షాల గొంతు నొక్కే కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చేయలేదని, కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారని ఆ దిశగా ప్రజల పక్షాన నిలవాలని కోరారు. శెట్టిపల్లి భూములకు కూటమి ప్రభుత్వం వచ్చాక విముక్తి కల్పించారని, అదే తరహాలో పద్మావతి పురం, సాయి నగర్, అవిలాల, పంచాయితీలలో కూడా ఇలాంటి విధానాన్ని అమలు చేస్తారని అధికారులు చెప్పడంతో, ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో వైసిపి నాయకులు ఉన్నారని ఆరోపించారు. చంద్రగిరి ఎమ్మెల్యే ప్రజలకు వారానికి నాలుగు రోజులు అందుబాటులోనే ఉన్నారని, నీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవాలని మోహిత్ రెడ్డిని హెచ్చరించారు. నాని పైన నిరాధార ఆరోపణలు చేస్తే పరువు నష్టం ధాబా వేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక సంస్కృత అకాడమీ ఏర్పాటుపై ప్రతిపాదన



**తిరుపతి విద్య, జూన్ 26 ప్రభాతవార్త:**

సంస్కృత భాష అభివృద్ధి, ప్రచారానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు శరత్‌చంద్ర (ఆర్.డి. విల్సన్)తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్కృత భాషాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. సమావేశంలో సంస్కృత భాషను ప్రజలకు మరింత చేరువ చేయడం, భారతీయ జ్ఞాన సంపదను విస్తృతంగా ప్రచారం చేయడం, సంయుక్తంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా అకాడమీ అధ్యక్షుడు శరత్‌చంద్ర మాట్లాడుతూ, సంస్కృత భాష ప్రాచుర్యానికి విశ్వవిద్యాలయం చేసిన సూచనలను పరిశీలించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. త్వరలో నిర్వహించనున్న సంస్కృత సప్తాహం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సంస్కృత భాష విశిష్టతను చాటిచెప్పే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తిరుపతిలో ప్రత్యేక సంస్కృత అకాడమీ ఏర్పాటు అంశంపై కూడా చర్చ జరిగినట్లు తెలిపారు. సంస్కృత భాషాభివృద్ధికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తెలుగు-సంస్కృత అకాడమీ పరస్పర సహకారంతో ముందుకు సాగేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంస్కృత విద్వాంసులు పాల్గొని సంస్కృత ప్రచారం, అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు

## కుంబాభిషేకానికి ఆర్యవైశ్యుల ఆహ్వానం



**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 26 ప్రభాతవార్త:**

శ్రీకాళహస్తిలోని బజారువీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ద్వితీయద్వాదశ వర్ష కుంబాభిషేకానికి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి అధ్వర్యంలో యువకులు కమిటి సభ్యులు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆలయం నిర్మించి సుమారు 30 సంవత్సరాలు అయ్యింది. ఈ నేపద్యంలో రెండవ కుంబాభిషేకం నిర్వహిస్తు న్నారు. ఈ నెల 30నుంచి వచ్చేనెల 2 వరకు జరిగే కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపద్యంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో గుర్రప్పశెట్టితో పాటు అధ్యక్షుడు జాలుగంటి మురళిగుప్తా, టి.స్వరూప్, కార్తీక్, పొట్టి భాస్కర్, రమేష్, కుమార్‌లు ఆహ్వానించారు.

## అప్పల బాధతో ఒక వ్యక్తి ఆత్మహత్య



**పుత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త :**

అప్పుల బాధతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆర్టీసి బస్టాండ్‌లో కూల్ డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తున్న మహదేవ్ రాయల్ (53) తన దుకాణంలోనే ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు తెలిపిన మేరకు...మృతుడు భారత్‌పే ద్వారా రుణం తీసుకున్నారు. తిరిగి చెల్లించడంలో ఆలస్యం కావడంతో సంబంధిత ప్రతినిధులు గురువారం సాయంత్రం దుకాణం వద్దకు వచ్చి వత్తిడి తీసుకువచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన రాయల్ ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు తిరుపతికి ఏఎన్‌జీఆర్ఏయూ ఉపకులపతి

### -వ్యవసాయ పరిశోధన కేంద్రం,ఎస్వీ వ్యవసాయ కళాశాల సందర్శన

**తిరుపతి విద్య, జూన్ 26 ప్రభాతవార్త:**



ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఏఎన్‌జీఆర్‌ఏయూ) ఉపకులపతిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డా. పి.వి. సత్యనారాయణ శనివారం తొలిసారిగా తిరుపతిని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆయన తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఏఆర్ఎస్), శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పరిశోధన కార్యక్రమాలు, విద్యా కార్యకలాపాలను సమీక్షి ంచనున్నారు. అలాగే విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే భారీ ర్యాలీలో ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులతో కలిసి పాల్గొననున్నారు. ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డా. పి.వి. సత్యనారాయణ తిరుపతిలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## వేద విద్యతో పాటు సంస్కృత బోధనకు ప్రత్యేక కేంద్రం

**తిరుపతి విద్య, జూన్ 26 ప్రభాతవార్త:**



జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా ఘంటసాల మండలం తాడేపల్లిలో ఏర్పాటు చేసిన శృతి భారతి వేద పాఠశాలను శుక్రవారం ప్రారంభించారు. అర్చకత్వం, పౌరహిత్యం (కర్మకాండ), ప్రాక్‌శాస్త్రీ అధ్యయనాల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మలయాళ స్వామి ఆశ్రమాధీశులు పూజ్యశ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, దివిసీమ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎన్నారై దాతలు మూల్పూరి వెంకట్రావు-సౌజన్య దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిపూర్ణానందగిరి స్వామి మాట్లాడుతూ, వేద, సంస్కృత విద్యాభివృద్ధికి ఈ పాఠశాల కేంద్రంగా నిలవాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, అధ్యయన కేంద్ర నిర్వహణ కమిటీ ప్రతినిధులు, విద్యార్థులు, ఆశ్రమవాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీతారామస్వామిలవారికి ప్రాణ ప్రతిష్ట



**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 26 ప్రభాతవార్త:**

శ్రీకాళహస్తి మండలం జగ్గరాజు పల్లిగ్రామంలో జరుగుతున్న సీతారామస్వామి చిత్ర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాల్లో శుక్రవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం జగ్గరాజు పల్లిలో కొత్తగా శ్రీరామమందిరం నిర్మించారు. ఈ ఆలయ కుంబాభిషేక కార్యక్రమాలకు గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంఎల్‌ఏ హాజరయ్యారు. ఎంఎల్‌ఏకు మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ చెలికం పాపిరెడ్డి స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు జరిపించారు. గ్రామస్తుల చొరవను ఎంఎల్‌ఏ అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌ఏతో పాటు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, జయచంద్ర నాయుడు, శివకుమార్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులున్నారు.

# డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల రాయితీని సద్వినియోగం చేసుకోండి

## -జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఎస్. చిన్న రెడ్డయ్య



**తిరుపతి కలెక్టరేట్, జూన్ 26 ప్రభాతవార్త :**

202627 ఆర్థిక సంవత్సరంలో బిందు, తుంపర్ల సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకొనే రైతులకు ఈ సంవత్సరం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే మొదలైనది. బావి లేదా బోరు ఉన్న ఎస్సీ,ఎస్టీ రైతులకు 100 రాయితీతో పై పరికరాలు అందిస్తామని జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఎస్. చిన్న రెడ్డయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి జిల్లాలో మామిడి, బత్తాయి, నిమ్మ, సపోట, బొప్పాయి, అరటి ఇతర పండ్ల తోటలకు కూరగాయలు, పూల మొక్కల తోటలకు, ఆయిల్ పామ్, చెరకు, మల్బరీ పంటలు సాగు చేస్తున్న వారికి మాత్రమే పై పరికరాలకు రాయితీ వర్తిస్తుంది. 5 ఎకరాలు లోపు పంటలు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 రాయితీ ఉంటుంది. 5 ఎకరాలు పైబడిన పంటలు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 రాయితీ ఉంటుంది. 10 ఎకరాలు లోపు ఉన్న ఇతర కులాలకు చెందిన రైతులకు 90 రాయితీ ఉంటుంది. 10 ఎకరాలు పైబడిన అన్ని కులాల రైతులకు 50 రాయితీ ఉంటుంది. స్ప్రింక్లర్లకు మాత్రం 5 ఎకరాలు లోపు ఉన్న రైతులందరికీ 50 రాయితీ ఉంటుంది. వేరుశనగ, పెసలు, మినుము మొదలగు పంటలు సాగు చేయాల్సి ఉంటుంది. 202627 వ ఆర్థిక సంవత్సరంకు గాను జిల్లా యొక్క లక్ష్యం 6500 హెక్టార్లుగా నిర్దేశించడం జరిగినది. కావున ఆసక్తి గల రైతులు ఆయా పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంత వరకు 202425 సంవత్సరం క్రింద ఓసి ,బిసి రైతులు 2045 మంది, ఎస్సీ 187, ఎస్టీ12, మొత్తం 2244 మందికి 2400 హెక్టార్లకు 23.31 కోట్లు రాయితీ కల్పించాము. అలాగే 202526 సంవత్సరం లో ఓసి బిసి రైతులు 2954 మంది, ఎస్సీ 508, ఎస్టి 73, మొత్తం 3535 మందికి 4373 హెక్టార్లలో 37.49 కోట్లకు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌తో అనుమతి తీసుకొని పరికరాల సరఫరా, బిగింపు కార్యక్రమము పూర్తి కావస్తూ ఉంది. తిరుపతి జిల్లాలో మొత్తం పరికరాలు సరఫరా చేసే కంపెనీలు 28 ఉన్నాయి. రైతులు తమకు నచ్చిన కంపెనీ పరికరాల కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే డ్రిప్‌తో పాటు ఆటోమేషన్‌పై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ఆటోమేషన్ కొరకు దరఖాస్తు చేసుకొనే రైతుల కు 5 ఎకరాల లోపు ఉన్న వారికి 55 శాతం రాయితీ 22000/ రూపాయలు, 5 ఎకరాలపై ఉన్న రైతులకు 45 శాతం రాయితీ 18000/ రూపాయలు ఉంటుంది. ఆటోమేషన్ యూనిట్ ధర రూ. 40000/హెక్టారుకు ఆటోమేషన్ వ్యవస్థలో డ్రిప్ తో పాటు కంట్రోలర్లు, సోలేనోయిడ్ వాల్వ్ లు, సెన్సార్, ఆటో స్టార్ట్ రిలే, కేబుల్ మొదలగు పరికరాలు తోటల్లో అమర్చుతారు. దీని వల్ల రైతులు తమ తోటలో లేకపోయిన, ఇంటినుండే కాని, ఇతర రాష్ట్రాలలో, దేశాలలో వుండి కూడా నీటి సరఫరాను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆన్, ఆఫ్ చేసుకోవచ్చు. రైతులు ఈ ఆటోమేషన్ పథకమును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోగలరు. ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట మరిన్ని ఇతర వివరములకు తిరుపతి జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఎస్. చిన్న రెడ్డయ్య వారిని ఈ సెల్ ఫోన్ నెంబర్ ను 7995072129. సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

# తిరుపతి డివిజన్

## రక్తదానంపై అవగాహన

### -31 యూనిట్ల రక్త సేకరణ...సేవా స్ఫూర్తి చాటిన కళాశాల




**తిరుపతి విద్య, జూన్ 26 ప్రభాతవార్త:**

ప్రాణదానానికి సమానమైన రక్తదానంపై యువతలో చైతన్యం కల్పించే లక్ష్యంతో ఎస్.వి. వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరం విశేష స్పందన పొందింది. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ శిబిరంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కలిసి 31 యూనిట్ల రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేశారు. ముఖ్యంగా అధ్యాపకులు స్వయంగా రక్తదానం చేసి విద్యార్థులకు ఆదర్శంగా నిలవడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎస్. హేమలత శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, రక్తదానం ఒకరి ప్రాణాలను కాపాడే అత్యున్నత మానవతా సేవ అని పేర్కొన్నారు. సమాజం పట్ల బాధ్యతతో ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. రక్తదానం పట్ల యువతలో అవగాహన పెంపొందించడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. శిబిరంలో గణాంక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ డా. జి. మోహన్ నాయుడు, నేలల శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ డా. ఎం. రాఘవేంద్ర స్వయంగా రక్తదానం చేసి విద్యార్థులను ప్రోత్సహించారు. బోధనేతర సిబ్బందికి చెందిన కె. చంద్రయ్య, టి. శ్రీనివాసన్, పి. మునికృష్ణ, పి.ఎస్.ఆర్. అనిల్ తేజ కూడా రక్తదానం చేసి సేవా స్ఫూర్తిని చాటిచెప్పారు. ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మోడల్ బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డా. భార్గవి పర్యవేక్షణలో రక్త సేకరణ చేపట్టగా, కళాశాల ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డా. సి. నాగమణి, వైద్యాధికారి డా. ఎస్.ఎం.ఎస్. నాగ శివరాం బృందం వైద్య సేవలు అందించింది. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ అధికారులు డా. పి. లత, డా. పి. శాంతి, డా. వి. శైలజ, డా. పాండురంగ, డా. కె. నవ్య జ్యోతి సమన్వయం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు,సిబ్బందిఉత్సాహంగా పాల్గొనడంతో శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు.




## ప్రకృతి అందాలకు డైమండ్ రూపం.. నువా

**తిరుపతి విద్య, జూన్ 26 ప్రభాతవార్త:**

ప్రముఖ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రకృతి సృష్టిలోని ఆకృతులు, అల్లికల నుంచి స్ఫూర్తి పొందిన నువా పేరుతో కొత్త నేచురల్ డైమండ్ జ్యువెలరీ కలెక్షన్‌ను విడుదల చేసింది. ఆధునిక డిజైన్లతో రూపొందించిన ఈ కలెక్షన్‌లో ప్రకృతిలో కనిపించే విభిన్న నమూనాలు, ఆకృతులను ఆభరణాల రూపంలో ఆవిష్కరించినట్లు సంస్థ తెలిపింది. 18 క్యారెట్, 14 క్యారెట్ బంగారంతో రూపొందించిన ఈ కలెక్షన్‌లో నేచురల్ డైమండ్స్‌తో పాటు రంగురంగుల రత్నాలు, సిరామిక్ కలర్ ఎనామెలింగ్, మల్టీటోన్ రోడియం ఫినిషింగ్‌ను వినియోగించినట్లు పేర్కొంది. రోజువారీ వినియోగంతో పాటు ప్రత్యేక సందర్భాలకు అనువుగా ఉండేలా ఈ ఆభరణాలను రూపొందించినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పీ. అహమ్మద్ మాట్లాడుతూ, ప్రకృతిలోని సహజ సౌందర్యాన్ని ఆధునిక డైమండ్ ఆభరణాల రూపంలో వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో నువా కలెక్షన్‌ను రూపొందించినట్లు తెలిపారు. అన్ని వయసుల మహిళలను దృష్టిలో ఉంచుకుని ప్రతి డిజైన్‌ను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ కలెక్షన్‌కు సినీనటి కరీనా కపూర్ ఖాన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమెతో రూపొందించిన ప్రచార చిత్రాన్ని కూడా సంస్థ విడుదల చేసింది. 1993లో ప్రారంభమైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రస్తుతం 14 దేశాల్లో 445కు పైగా షోరూమ్‌లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత తదితర రంగాల్లో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలను సంస్థ అమలు చేస్తోంది.

## కళాశాలలకు కొనసాగుతున్న విద్యార్థుల ఆదరణ




**తిరుపతి విద్య, జూన్ 26 ప్రభాతవార్త:**

తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలకు ఈ విద్యా సంవత్సరంలోనూ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రవేశాల ప్రక్రియలో భాగంగా మూడో విడత అడ్మిషన్లు శుక్రవారంతో ముగియగా, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో వివిధ గ్రూపుల్లో ఇప్పటివరకు 343 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. టీటీడీ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉండటంతో ప్రతి సంవత్సరం ఈ కళాశాలకు ప్రవేశాల కోసం పోటీ నెలకొంటుందని అధికారులు తెలిపారు. మూడో విడత కౌన్సెలింగ్‌లో ఎంపికైన విద్యార్థులు ప్రవేశాలు పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు. ఇంకా ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అవసరమైతే తదుపరి విడత ప్రవేశాలను నిర్వహించనున్నట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు టీటీడీ విడుదల చేసే అధికారిక ప్రకటనలను గమనించాలని సూచించారు.

## ఇంటర్ ప్రవేశాలకు జూన్ 30 వరకు అవకాశం

**తిరుపతి విద్య, జూన్ 26 ప్రభాతవార్త:**



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉన్నట్లు ఆర్ఐఓ జి.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని 72 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటివరకు 2వేలకుపైగా విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు ఆయన వెల్లడించారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈసారి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు మెరుగ్గా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. వేసవి సెలవుల సమయంలో అధ్యాపకులు గ్రామాలకు వెళ్లి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వ్యక్తిగతంగా కలిసి ప్రభుత్వ కళాశాలల్లో చేరేలా అవగాహన కల్పించారని తెలిపారు. అధ్యాపకుల కృషి వల్లే ఈ ఏడాది ప్రవేశాలు గణనీయంగా పెరిగాయని ఆయన అభినందించారు. ఇంకా వారం రోజుల మాత్రమే గడువు ఉన్నందున పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కంటి పరీక్ష శిబిరం



శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తి జామియా మస్‌జిద్‌లో శుక్రవారం డాక్టర్ అగర్‌వాల్ కంటి ఆసుపత్రి సారధ్యంలో కంటి పరీక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనల తరువాత మసీదులోని అరబ్బి పాఠశాలలో వైద్యపరీక్షలను ఏర్పాటు చేసారు. సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించిన సిబ్బంది కొంత మందిని తిరుపతిలోని డాక్టర్ అగర్‌వాల్ కంటి ఆసుపత్రికి రేఫర్ చేసారు. కొంత మంది అద్దాలు మరి కొంత మందికి మందులను అందించారు. ఈ వైద్యపరీక్షలను అప్తోమిస్టు మంజునాథ్, అప్టికల్స్‌కు చెందిన వినయ్‌లు వైద్యపరీక్షలు జరిపారు. శిబిరం ఏర్పాటును మసీదుముతవల్లి అక్రం సాహెబ్ సూచనలతో ఏర్పాటు చేసారు.మహ్మద్ ఫుజేల్, హమీద్‌లు వైద్యసిబ్బందికి సహాకరించారు.

## సింగిరికోన జయంతి పూజలు



శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త:
సింగిరికోన శ్రీ లక్ష్మీనరసింహాస్వామి జయంతి సందర్భంగా శుక్రవారం తెలుగుదేశం యువత సారధ్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, అన్నదానాలు జరిపారు. తెలుగుయువత నాయకులు ఎస్‌సివి దిలీప్,సత్రవాడ ప్రవీణ్,బిల్లుబాలయాదవ్‌ల సారధ్యంలో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలతో పాటు నిరుపేదలకు భారీ ఎత్తున అన్నదానం జరిపారు. ఈ సందర్భంగా పూజారి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు.

## మహారాష్ట్ర ప్రతినిధులకు శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త:
ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమలేశుని దర్శనానికి వచ్చిన పలువురు మహారాష్ట్ర ప్రతినిధులకు శ్రీకాళహస్తి శాసన సభ్యుడు బబొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ముక్కంటీశుని ప్రసాదాలను అందించారు. శుక్రవారం సుధీర్‌రెడ్డి వారిని కలవటం ఎంతో అనందంగా ఉదన్నారు. తమకు చిరకాల మిత్రులైన లోక్‌సభ ఎంపి కళ్యాణ్, డాక్టర్ శ్రీకాంత్ షిండే, టిటిడి బోర్డుసభ్యులు సౌరబ్‌బోరా ఎంపి ధారాశివ్,ఓంప్రకాష్‌పవన్,రాజే నిం భాల్కర్, సిఎం రాజేష్‌లను కలసి నట్లు ఎంఎల్‌ఏ వివరించారు. చిరకాల మిత్రులను కలుసుకోవటం ఎంతో అనందాన్ని కల్గించిందని అన్నారు.వారికి శివయ్య ప్రసాదాలను అందించి దుశ్శాలువలతో సత్కరించారు.

## ఘనంగా మొహర్రం వేడుకలు

చిట్వేలి, జూన్ 26 ప్రభాతవార్త:



మహమ్మద్ ప్రవక్త మనముడైన ఇమామ్ హుస్సేన్ కర్బలా యుద్ధంలో చేసిన త్యాగానికి, ధైర్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకలను చిట్వేలి మండల వ్యాప్తంగా శుక్రవారం ముస్లిం పెద్దలు ఘనంగా నిర్వహించారు.కుల మతాల అతీతంగా హిందూ, ముస్లింలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. చిట్వేలి లోని సింగనమల వీధి,తోపు వీధి పీర్ల చావిడితో పాటుగా నగిరిపాడు, కస్తూరి వారి పల్లి, నేతివారిపల్లి గ్రామాలలో ఈ వేడుకలు మిన్నంటాయి. గడిచిన నాలుగు రోజుల నుంచి చావిడ్ల దగ్గర పీర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేక అలంకరణతో ప్రతిరోజు ఊరేగింపు చేపట్టారు.గురువారం రాత్రి అగ్నిగుండం ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక వేషధారణలతో, వాయిద్యాలతో పీర్లను పెద్ద ఎత్తున ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. దారి వెంబడి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాదాలతో పాటు దీవెనలు అందించారు. కార్యక్రమంలో పెద్దలు, యువత ,పిల్లలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం పహారా నిర్వహించింది.

## భద్రత పరంగా అన్ని చర్యలు

-డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా



తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవారి ఆలయ భద్రతతోబాటు యాత్రికుల రక్షణకు పోలీసుశాఖ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. టిటిడితో కలసి పోలీస్‌శాఖ భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. శుక్రవారం ఉదయం ఎపి డిజిపి హరీష్‌కుమార్ గుప్త కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి ఈఓముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి డిజిపి గుప్తాకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అర్ధగిరి 'గిరి ప్రదక్షణ' రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తవణంపల్లె, జూన్ 26 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీఅర్ధగిరి వీరాంజనేస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న గిరి ప్రదక్షణ రోడ్డుకు శుక్రవారం లాంచనంగా భూమిపూజ చేసి జంగిల్ క్లియరెన్స పనులను ప్రారంభించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కార్యాలయం ఆదేశాల మేరకు అర్ధగిరి ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం అవుతున్న విషయం విధితమే. ఈమేరకు అర్ధగిరి ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు కావలసిన వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు దేవస్థానం వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జరుగనున్నాయి. ఈమేరకు ఇప్పటికే దేవస్తానం అభివృద్ధిపై ఆలయ ఛైర్మన్ రఘుపతి, ఈఓ మునిశేఖర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ గత నెల రోజుల క్రితం సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగా అర్ధగిరి ఆలయం చుట్టూ గిరి ప్రదక్షణ కోసం రోడ్డును నిర్మించాలని సమావేశంలో ప్రతిపాదించారు.ఈమేరకు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షణకు అవసరమైన సుమారు 13 కిలోమీటర్ల రోడ్డును నిర్మించడానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ముందుగా రోడ్డు సర్వే చేయడానికి వీలుగా జంగి క్లియరెన్స్ పనులను శుక్రవారం ప్రారంభించారు. అర్ధగిరి క్షేత్రంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పనులను ప్రారంభించారు. ఉదయం ఆలయం సమీపంలో దేవస్థానం ఛైర్మన్ పైమాఘం రఘుపతి, ఈఓ మునిశేఖర్‌ల ఆధ్వర్యంలో రోడ్డు పనులను పూజలు చేసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, పలువురు నాయకులు, పాలకమండలి సభ్యులు, అర్చకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బొక్కసంపాళెం ఆలయం ప్రపత్యేక పూజలు

శ్రీకాళహస్తి రూరల్ , జూన్ 26 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తి దేవస్థాన అనుబంధ ఆలయమైన బొక్కసంపాళెం గ్రామంలోని కామాక్షమ్మ సమేత కోదండ రామేశ్వర స్వామి దేవాలయం నేడు ప్రదోషకాల పూజలు వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం నుండి గంటల వరకు నందీశ్వరునికి ప్రదోషకాల అభిషేకం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు అభిషేకం జరిపి నందివాహనంపై అలంకరించి దేవాలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహిస్తారు.గ్రామంలోని భక్తులు, పరిసర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి, అమ్మవార్ల కృపా కటాక్షాలు పొందగలరని ఆలయ అధికారులు కోరారు.

## 20ఏళ్ల సమస్యకు పరిష్కారం

-హరిజనవాడలో ప్రమాదకర విద్యుత్ లైన్ తొలగింపు..

తొట్టంబేడు, జూన్ 26 ప్రభాతవార్త:



తొట్టంబేడు గ్రామ హరిజనవాడ ప్రజలకు ఎట్టకేలకు ఊరట లభించింది. 20 ఏళ్లుగా ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కెవి విద్యుత్ లైన్ వల్ల ప్రమాద భయంతో బతుకుతున్న వారి సమస్యకు పరిష్కారం దొరికింది. ఈ ప్రమాదకర లైన్ కారణంగా గతంలో ప్రాణనష్టం కూడా జరిగింది. లైన్ తొలగించాలని స్థానికులు ఎప్పటినుంచో విన్నవిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు జెసిబి, ట్రాక్టర్ సహాయంతో ఆ ప్రమాదకర లైన్‌ను పూర్తిగా తొలగించారు. మండల పార్టీ అధ్యక్షుడు.రావిళ్ల మునిరాజ నాయుడు, ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, తంగెళ్లపాలెం సింగిల్ విండో సహకార బ్యాంక్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, చందు తదితర నాయకులు, అధికారులు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.

## బీసీల సంక్షేమం ఎన్డీయే కూటమితోనే సాధ్యం: టీడీపీ నేతలు

శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:



గడచిన నాలుగు దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలబడి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ, ఎన్డీయే కూటమితోనే బీసీలకు మేలు జరుగుతుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ నేతలు కొనియాడారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మరో10 మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందులో బాలికలకు 5, బాలురకు 5 గురుకులాలను 2026-27 విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. వడ్డెర సోదరులకు మైనింగ్ లీజులు ఇవ్వాలని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్‌కు విన్నవించగా, ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వడ్డెర సొసైటీలకు ప్రాధాన్యత కల్పిస్తూ క్వారీ లీజుల కేటాయింపుపై ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, లోకేష్‌కు వడ్డెర సోదరులు కృతజ్ఞతలు తెలుపుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శియం.ఉమేష్ రావు, తంగేళ్ళపాలెం పిఏసియస్ ఛైర్మన్ భాస్కర్ ముదిరాజ్, నాయకుల డి.వి. నారాయణ, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, కృష్ణమూర్తి.. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొహరం వేడుకలు

రైల్వేకోడూరు రూరల్, జూన్ 26 ప్రభాతవార్త:



రైల్వే కోడూరు మండలంలోని రాఘవరాజుపురం, రెడ్డివారిపల్లి గ్రామాలలో శుక్రవారం అత్యంత వైభవోపేతంగా మొహరం (పీర్ల పండగ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవరాజాపురం నందు ఎన్నారై సయ్యద్ మహమ్మద్ భాష ఆధ్వర్యంలో అత్యంత నూతన విద్యుత్ కాంతులతో గ్రామమంతా నింపి గుండాన్ని భక్తుల కోసం ఏర్పాటు చేసి అదే విధంగా గురువారం రాత్రి దాదాపు వందలాది మందికి అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నారై సయ్యద్ మహమ్మద్ భాష మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సైదన్ సాహెబ్ కుటుంబం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానవాజ్ ఆదిల్, అఖిల్, మహమ్మద్, అహ్మద్, మన్సూర్ తో పాటు గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు.

## గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య

తిరుపతి,జూన్ 26ప్రభాతవార్త:
తిరుపతి రైల్వే స్టేషన్ పరిధిలో తిరుచానూరు వైపు వెళ్ళే ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రైల్వే పట్టాల పై గుర్తు తెలియని ఒక మగ వ్యక్తి (25 -30) రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ వివరాలను తిరుపతి రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో ప్రభుత్వ రైల్వే పోలీస్ సిఐ ఎన్.వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని వద్ద ఎలాంటి చిరునామా లభించలేదు. తిరుపతి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ విషయం ఎవరికైనా వివరాలు తెలిసిన,సమాచారం కావాల్సి ఉంటే తిరుపతి ప్రభుత్వ రైల్వే పోలీస్‌లనుగానీ 9247575618 నంబర్‌కు సంప్రదించాలని సిఐ తెలిపారు.

## మనం చదివే సూరాలు సక్రమంగా ఉండాలి!

అల్లాహ్‌ను ప్రశంసించాలి...శపించరాదు

శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త:



మనం నిత్యం నమాజులు చదివే సూరాల ఉచ్చారణ సక్రమంగా ఉండాలని అల్లాహ్‌ను ప్రశించాలి కానీ శనించరాదని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మొహర్రం మాసం పదవ రోజు ప్రవక్త మనవడు హుస్సేన్ షహీద్(వధింపబడిన) వృత్తాంతాన్ని వివరిస్తూ నాడు శత్రువులు యుద్దంలో బాణాల వర్షం కురిపిస్తున్న నమాజును ఆచరించారన్నారు.కానీ నేడు మనం ఏం చేస్తున్నామని ప్రశ్నించారు. మనం నిత్యం చదివే సూరే ఫాతేహా ఉచ్చారణలో దోషాలుంటే ప్రశించటానికి బదులు శపించినట్లు అవుతందని గుర్తించాలన్నారు. మనం చదివే సూరాలను గురువుల వద్ద చదివి సరి చేసుకోవాలని రేహాన్ పిలుపు నిచ్చారు.నేడు మనం కష్టాలు కన్నీళ్ళు ఎదుర్కొటానికి కారణం ఈమాన్ (నమ్మకాన్ని)ను ఆచరించకపోవటమే అన్నారు. ఏదైనా మనల్ని సృష్టించిన అల్లాహ్ వల్లనే సాధ్యం తప్ప మనం తలచుకునేది జరగదనే సత్యాన్ని గుర్తించాలన్నారు. మనం చదివే సూరాలు సక్రమంగా ఉంటే అల్లాహ్ కరుణ నిత్యం మన మీద ఉంటుందని గుర్తించాలన్నారు.

# తిరుపతి డివిజన్

## నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయి.ఈ నేపధ్యంలో శుక్రవారం తెలంగాణాలోని హనుమకొండకుకు చెందిన సత్య నారాయణ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత ఆయన ఆలయ ఛైర్మెన్ కొట్టెసాయిప్రసాద్‌ను కలసి తాను నిత్యాన్నదాన పథకంలో భోజనం చేసానని చాలా చక్కగా ఉందని స్టార్ హోటల్స్‌లో కూడా లేని విధంగా రుచికరంగా ఉందన్నారు.దాంతో తాను నిత్యాన్నదాన పథకానికి విరాళం ఇవ్వాలని భావిస్తున్నట్లు వివరించారు.ఆతన్ని ఛైర్మెన్ సాదరంగా ఆహ్వానించారు.నిత్యాన్నదాన పథకానికి రూ.1లక్ష ఒక వెయ్యి లు అందించారు. వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.కాగా శ్రీకాళహస్తీశ్వరుని సేవలో నెల్లూరుకు చెందిన ఎంఎల్‌సి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులతో రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఇఓ స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనం తరువాత ఆయనకు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి ఇఓ వెంకటేశు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## మాజీ కౌన్సిలర్ మృతి...పలువురి సంతాపాలు

శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి పట్టణం 15వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గురు నాగరాజ్ శుక్రవారం ఆకస్మిక మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపాలు తెలిపారు. వార్డు అభివృద్ధికి ప్రణాళికా బద్దంగా కృషి చేసిన నాగరాజు మృతికి వార్డు ప్రజలు సంతాంపాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. నాగరాజ్ నివాసానికి వెళ్లిన పవిత్ర రెడ్డి ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమెతో పాటు కోళ్లూరు హరినాయుడు,పటాన్ ఫరీద్, అస్లాం, ఉదయ్‌కుమార్, మున్నా రాయల్, జూమ్లేష, ఆవుల శ్రీను, రవి, దివ్య కాంత్ తదితరులు ఉన్నారు.

## శివుని సేవలో...సినీనటి కీర్తి సురేష్ దంపతులు



శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:
సినీ నటి కీర్తి సురేష్ దంపతులు శుక్రవారం జ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధానంలో వారు రాహు కేతు పూజ నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.దర్శనం అనంతరం దేవస్థానం ఈవో బి కే వెంకటేశ్వర్లు కీర్తి సురేష్ దంపతులను సన్మానించి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేత మరియు శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ బాలు ఢిల్లీ బాబుపాల్గొన్నారు.

## సర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:



ఎన్నికల సంఘం ఈనెల 15 నుంచి నిర్వహిస్తున్న సర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జమాతే ఇస్లామీ హింద్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అమీర్ బాష పిలుపునిచ్చారు.శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూర్ పేటలో గల మస్జిదే ముహమ్మదీయలో జుమా నమాజ్ అనంతరం ఆయన ప్రసంగించారు. బీఎల్వోలు ఇస్తున్న ఓటరు ఫారంలో ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని, ఫోటోను అతికించి ఒక ఫారం అధికారులకు ఇచ్చి మరొక ఫారాన్ని భద్రపరచుకోవాలని అవగాహన కల్పించారు. బీఎల్వోలు కూడా ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు షేక్ ముహమ్మద్, గౌస్ మొహిద్దీన్, ముజమ్మిల్ అహ్మద్, అబూబకర్, అబ్దుల్ కలామ్, బాబూ భాయ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన నాయకుడుకు అండగా జనసేన

తొట్టంబేడు, జూన్ 26 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద మామల కోటయ్యను హిట్ అండ్ రన్ ప్రమాదంలో గాయపడిన విషయం అత్యంత బాధాకరం అని జనసేన నాయకులు అన్నారు. ప్రమాదానికి కారణమైన నాలుగు చక్రాల వాహన డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ, గాయపడిన వ్యక్తిని కనీసం పలకరించకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడం అత్యంత శోచనీయం. ప్రస్తుతం ఆయన క్రమంగా కోలుకుంటుండటం కొంత ఉపశమనాన్ని కలిగించింది.ప్రజా సేవలో నిరంతరం ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్న కోటయ్య సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని దండి నరేంద్ర అన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నాయకులు లక్ష్మణ్, నవీన్, సుబ్బు, రాజేష్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు

వార్త | తిరుపతి ,చిత్తూరు జిల్లాలు, ◆ శనివారం 27 జూన్ 2026 | 3

# చంద్రగిరిలో రాజకీయ కలకలం

## -ఎమ్మెల్యే నానిపై...బిజెపి నేత తీవ్ర ఆరోపణలు



తిరుపతిరూరల్,జూన్ 26 ప్రభాతవార్త:
చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానిపై బిజెపి నేత మేడసాని పురుషోత్తమనాయుడు సంచన ఆరోపణలు చేశారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన కాం ట్రాక్టు వ్యవహారంలో అవినీతి, వేధింపులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం పురుషోత్తమనాయుడు మీడియాతో మాట్లాడుతూ తాను చేపట్టిన ఆరులైన్ల జాతీయ రహదారి పనులను ఎమ్మెల్యే నాని అడ్డుకుంటున్నారని తెలిపారు. పని ప్రారంభించినప్పటి నుంచి స్థానిక టిడిపి నాయకులు అనేక అవరోధాలు సృష్టించారని, ముఖ్యంగా గ్రావెల్ అనుమతుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని వెల్లడించారు. జాతీయ రహదారి పనులకు నెల నెలకు మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. చర్చల అనంతరం నెలకు నాలుగు లక్షల రుపాయాలు చెల్లించేలా ఒప్పందం కుదిరిందని, ఇప్పటివరకు సుమారు రూ.29లక్షల రుపాయాలు చెల్లించాల్సి వచ్చిందన్నారు. అయితే డబ్బులు చెల్లించినప్పటికి పనులు సాఫీగా సాగనీయకుండా మళ్లీ అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇటీవల పూర్తిగా పనులు నిలిపివేయించారని ఆరోఫించారు. మూడు నెలలుగా పనులు నిలిచిపోయాయని, కాంట్రాక్టును ఇతరులకు మళ్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ అంశంపై రాష్ట్ర స్థాయి నాయకులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లభించలేదని పురుషోత్తమ నాయుడు వాపోయారు. అధికారులను ప్రభావితం చేస్తూ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఎమ్మెల్యే నానిపై తీవ్ర విమర్శలు చేశారు.

**సేవ్ చంద్రగిరి పేరుతో ఉద్యమం :**
చంద్రగిరి ప్రజలను అవినీతి నుంచి రక్షించాల్సి న అవసరం ఉందని, సేవ్ చంద్రగిరి పేరుతో ఉద్యమం చేపట్టే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పురుషోత్తంనాయుడు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ఈ ఆరోఫణలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసాయి. ఎమ్మెల్యే నాని లేదా టిడిపి నాయకుల నుంచి ఈ ఆరోపణలపై ఇంకా అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. చంద్రగిరి ప్రజలను అవినీతి నుంచి రక్షించాల్సి న అవసరం ఉందని,

# తిరుపతి డివిజన్

## దొంగ ఓట్లపై అలుపెరగని పోరాటం : పులివర్తి సుధారెడ్డి



తిరుపతిరూరల్,జూన్ 26 ప్రభాతవార్త:
వైసిపి ప్రభుత్వ హయంలో దొంగ ఓట్లపై ప్రాణాలకు తెగించి పోరాటం చేశామని పులివర్తి సుధా రెడ్డి తెలిపారు. టిడిపి పార్టీ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై నాయకులు, కార్యకర్తలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. దొంగ ఓట్లు తొలగించేందుకు ఇది మంచి అవకాశమని, ప్రతి నాయకుడు తమ పరిధిలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. మేజర్గా తుమ్మలగుంట, మంగళం, పేరూరు, అవిలాల, తిరుచానూరు ప్రాంతాల్లో భారీగా అక్రమ ఓట్లు నమోదయ్యాయని ఆమె పేర్కొన్నారు. న్నికల పారదర్శకత కోసం అధికారులకు ఫిర్యాదులు, ఈ-మెయిల్స్ ద్వారా సమస్యలను తెలియజేస్తున్నామని చెప్పారు. ప్రతి ఓటరు తనపేరు జాభితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఇంటింటి ఓటర్ల పరిశీలనలో బిఎల్ఓలు, బిఎల్ఓలు సమన్వయంతో పని చేసే జాబితా పారదర్శకంగా తయారు చేయాలన్నారు. 18సంవత్స రాలు పూర్తి చేసుకున్న యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. అక్రమ ఓట్లు ద్వంద్వ నమోదులకు నియోజకవర్గంలో తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి పార్లమెంట్ అబ్జర్వర్గా జనసేన థామస్

కేవీబీ పురం, జూన్ 26 ప్రభాతవార్త:
తిరుపతి పార్లమెంట్ నిర్మాణ సారథుల సమాచార సేకరణకమిటీ పార్లమెంట్ అబ్జర్వర్గా కేవీబీ పురం జనసేన మండల అధ్యక్షుడు థామస్ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం నియామక ఆదేశాలు జారీ చేసింది. దీంతో జనసేన కార్యకర్తలు కేవీబీ పురంలో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ సాధారణ కార్యకర్తలను గుర్తించడం, పార్టీలో సముచిత స్థానం కల్పించడంలో పార్టీ అధినేత పవన్కి శాటి ఎవరూ లేరన్నారు. సాధారణ కార్యకర్తగా ఉన్న తనకు మండల అధ్యక్షుడి బాధ్యతలు ఇవ్వడంతో పాటు, తనపై నమ్మకం ఉంచి తిరుపతి పార్లమెంట్ అబ్జర్వర్గా అదనపు బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచిన అధిష్టానంకు విధేయతగా సేవలందిస్తానని థామస్ పేర్కొన్నారు. పార్లమెంట్ స్థాయిలో గుర్తించి, స్థానం కల్పించినందుకు రాష్ట్ర జిల్లా అధ్యక్షులకు థామస్ కృతజ్ఞతలు తెలిపారు.

## తేజస్వినికి ట్రిపుల్ ఐటీలో సీటు ఇవ్వాలి!

కేవీబీ పురం, జూన్ 26 ప్రభాతవార్త:
సత్యవేడు మండలంలో పదో తరగతిలో టాపర్గా నిలిచిన విద్యార్థిని తేజస్వినికి ట్రిపుల్ ఐటీలో వచ్చిన సీటుకు కౌన్సిలింగ్ వెళుతున్నసందర్భంలో బస్సు ప్రమాదం జరిగినందున మానవతా దృక్పథంతో విద్యాశాఖ మంత్రి స్పందించి తేజస్వినికి ట్రిపుల్ ఐటీలో సీటు కేటాయించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## రాయలచెరువు బాధితులకు రూ.1.09 కోట్లు

కేవీబీ పురం, జూన్ 26 ప్రభాతవార్త:
గత ఏడాది నవంబరులో మొంథా తుపాన్తో కేవీబీ పురం మండలంలోని రాయలచెరువుకు గండి పడి పొలాల్లో ఇసుక మేటలు వేసి, బండరాళ్లు పాతకుపోయి, భూములు కోతకు గురైన రైతులకు రూ.1,09,12,650లు చెల్లించాలని ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 8 నెలలుగా సాగుకు దూరంగా ఉన్న దాదాపు 500 ఎకరాల్లో తిరిగి పంటలు వేయడానికి వీలవుతుంది. అప్పట్లో నిమిషాల వ్యవధిలోనే పాతపాళెం, కళత్తూరు ఎస్సీ కాలనీ, పాతపాళెం అరుంధతివాడ, కళత్తూరు గ్రామాలు నీట మునిగాయి. ఇసుక మేటలు వేసిన భూములకు పరిహారం అవసరమని కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాజాగా ఆ నిధులు విడుదలయ్యాయి. ఇసుక మేటల తొలగింపుకు హెక్టార్కు రూ.12 వేలు, గండితో దాదాపు 1,100 ఎకరాలు సాగుకు పనికి రాకుండా పోయాయి. ఇసుక మేటలు, బండరాళ్ళను తొలగించలేక 793 మంది రైతులు కష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం ఇసుక మేటల తొలగింపునకు హెక్టార్కు రూ.12 వేలు, బండరాళ్లు తీసేందుకు హెక్టార్కు రూ.18 వేలు పంపిణీ చేయనున్నారు.

## సిఆర్ఎస్ నందు నూతన వరవడికి శ్రీకారం




రేణిగుంట జూన్ 26 ప్రభాతవార్త :
రేణిగుంట (తిరుపతి) సిఆర్యస్ నందు విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు సిఆర్ఎస్ ఉద్యోగులు సమకూర్చిన ఆర్థిక సహాయంతో ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందించి నూతన వరవడికి సిడబ్ల్యూ ఎం.ఆనంద్ గురువారం శ్రీకారం చుట్టారు. సిఆర్ఎస్లో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం కోసం ఈ ప్రక్రియకు సిడబ్ల్యూఎం ఆనంద్ నాంది పలికారు.. సాయం అందించడానికి సంస్థలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, ఉద్యోగులు ముందుకు రావడం హర్షణీయమని అభినందించారు. మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు చేస్తున్న సాయం చిన్నదైనప్పటికీ బాధల్లో ఉన్న ఆ కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కోరిన వెంటనే సాయం చేయడానికి ముందుకు వచ్చిన ఉద్యోగులకు కార్మికులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.. ఇటీవల మృతి చెందిన ముగ్గురు కార్మికుల కుటుంబాలు సిడబ్ల్యూఎం కార్మికుల సహకారంతో ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు.
కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ ప్రమోద్, డబ్ల్యూపిఓ శ్రీనివాస నాయక్, సీఎంటి ఎస్.కే కాజా, డబ్ల్యుఎం భానుప్రకాష్, ఎడబ్ల్యుఎం నవీన్ కుమార్, సిఆర్ఎస్ ఆఫీస్ సిబ్బంది, అధికారులు, సంఘ్, యూనియన్, ఓబిసి, ఎస్సీ,ఎస్టీ నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హై కోర్టు కేసు పెండింగ్లోనే షెడ్డు కూల్చివేత

### -న్యాయం చేయాలంటూ మాజీ సైనికుడి ఫిర్యాదు

పుత్తూరు రూరల్, జూన్ 26 ప్రభాతవార్త:
హైకోర్టులో వ్యాజ్యం పెండింగ్లో ఉన్నప్పటికీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తన టైర్ రీట్రెడింగ్ ఫ్యాక్టరీ షెడ్డుని కూల్చివేశారనిఆరోపిస్తూ ఓ మాజీ సైనికుడు పుత్తూరు పోలీసులను ఆశ్రయించారు. కైలాసపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు వి.షణ్ముగం శుక్రవారం పుత్తూరు పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తనకు పరమేశ్వరమంగళం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.139/3ఏలో 20 సెంట్లు స్థలంలో టైర్ రీట్రెడింగ్ ఫ్యాక్టరీ ఉందని తెలిపారు. జూన్ 25తేదీ రాత్రి ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఎన్హెచ్-205 అధికారులు, వారి కాంట్రాక్టర్తో కలసి ఫ్యాక్టరీ షెడ్డును కూల్చివేశారని ఆరోపించారు. అంతేకాకుండా తన భూమికి, షెడ్డుకు ఎలాంటి పరిహారం కూడా చెల్లించలేదని ఫిర్యాదులో వెల్లడించారు. ఈ ఘటనపై ఎన్హెచ్-205 అధికారులు, సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్ను విచారించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఈ ఫిర్యాదు ప్రతులను పుత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్(సీఐ), డీఎస్పీకి కూడా అందజేసినట్లు సమాచారం.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేయిద్దాం

### -ఇంటింటి అవగాహనలో చిట్టిబాబు

-చిత్తూరురూరల్(పాలసముద్రం), ప్రభాతవార్త:
అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయిద్దామని రూరల్ యాక్షన్ సంస్థ కార్యదర్శి పి.చిట్టిబాబు తెలిపారు.రానున్న ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా శుక్రవారం పాలసముద్రం మండలం వనదుర్గపురంలో ర్యాలీ , పోలియో అవగాహన పై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణి చేశారు. అమ్మాక్స్ సౌజన్యంతో రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టినట్లు సెక్రటరీ చిట్టిబాబు తెలిపారు. 5 సంవత్సరాల లోపు వున్న ప్రతి బిడ్డకి పోలియో చుక్కలు వేయించుకోవాలని, సంస్థ ఆధ్వర్యంలో సిబ్బంది కుడా 28నుండి 30వతేదీ వరకు పాల్గొంటారని తెలిపారు.ప్రతి చుక్క ఎంతో ముఖ్యమని,పోలియో రాకుండా చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో భూమిహిత ప్రోగ్రామ్ ,సంస్థ ఆర్గనైజర్ వరదరాజులు,భూమిహితులు రాజ్యలక్ష్మి ్మ, జయంతి, వెంకటేశులు , గ్రామస్తులు రాజేశ్వరి, తులసి రామ్, ఎర్రబ్బా, ధనమ్మ,విమలమ్మా తదితరులు పాల్గొన్నారు.

## చేతివృత్తులు కుటుంబాలకు జీవన ఆధారం

తిరుపతి కలెక్టరేట్, జూన్ 26 ప్రభాతవార్త :



రాస్ జన శిక్షణ సంస్థాన్, తిరుపతి వారి ఆధ్వర్యంలో తిరుపతిలోని లక్ష్మీపురం క్లస్టర్ సంబంధించి మహిళల కు మూడు నెలల ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాస్ ఆడిట్ మేనేజర్ బాలాజీ రెడ్డి, జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం డైరెక్టర్ డా. మోహన్ సార్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.సుధాకర్రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డా. మోహన్సార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతివృత్తులు నేర్చుకుని అభివృద్ధి చెందాలని తెలియ జేశారు. నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుటుంబంలో ప్రతి ఒక్కరూ పనిచేస్తూ ముందుకు సాగాలని తెలిపారు. అంతే కాకుండా జన శిక్షణ సంస్థాన్ నిర్వహించే వివిధ రకాల చేతి వృత్తుల పై శిక్షణ తీసుకోవాలని కోరారు. తరువాత బాలాజీ రెడ్డి మాట్లాడుతూ చేతివృత్తులతోపాటు ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో చేరి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని. అలాగే రాస్ నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టైలరింగ్ నేర్చుకోవడానికి వచ్చినటువంటి మహిళలందరికీ ఉచితంగా ముడి సరుకుని అందించారు. ఈ కార్యక్రమంలో రాస్ ఫీల్డ్ ఆఫీసర్ కాగితల తేజ,చంద్రకళ,క్లస్టర్ లీడర్లు మరియు నేర్పించే టీచర్ జీ . సుమతి , 40 మంది మహిళలు పాల్గొన్నారు.

## ఆధారాలు సమర్పిస్తే ఓటుకు డోకా ఉండదు



సత్యవేడు, జూన్ 26 ప్రభాతవార్త:
ఓటర్లు కొన్ని పరిస్థితులు దృశ్య మ్యాపింగ్ చేసుకోకపోయిన తగిన ఆధారాలు సమర్పిస్తే ఓటుకు డోకా ఉండదని తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ ఎలక్టోరల్ నమోదు అధికారిణి రోజ్మండ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె స్థానిక రెవెన్యూ కార్యాయలంలో సర్ ప్రక్రియ ప్రగతిపై పలువురు బీఎల్వోలు, అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రోజ్మండ్ మీడియాతో మాట్లాడుతూ మ్యాపింగ్కి సంబంధించి ఓటర్లు ఎవరూ కూడా అపోహ పడాల్సి న పని లేదన్నారు. మ్యాపింగ్ కానీ ఓటర్లకు నోటీసులు పంపిన వెంటనేఎన్నికల సంఘం పేర్కొన్న 12 రకాల గుర్తింపులో ఏదో ఒకటి సమర్పిస్తే ఓటర్ల జాబితాలో పేరు తొలగించారన్నారు. ప్రస్తుతం నియోజక వర్గంలో రెండు లక్షల 16 వేల 202 ఓటర్లకు సంబంధించి ఎన్రోల్మెంట్ ఫామ్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటికే రెండు లక్షల 10 వేల 208 ఫామ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో రోజుక 12,000 చొప్పున టార్గెట్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అయితే సంబంధిత బీఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి 2002 ఓటర్ల జాబితాతో సరిపోవాల్సి ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి నమోదు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు అధికారులు, బూత్ స్థాయి అధికారులు(బీఎల్వోలు) ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సర్ ప్రక్రియలో నియోజకవర్గంలో డిజిటలైజేషన్ పరంగా నారాయణవనం 20.02 శాతం మొదటి స్థానంలో ఉండగా సత్యవేడు 19.87 శాతం తో రెండవ స్థానంలో ఉందన్నారు. తదుపరి బుచ్చినాయుడు కండ్రిగ 17.62 శాతంతో తృతీయ స్థానంలో ఉన్నట్టు వివరించారు. జాబితాలో ఉన్న వ్యక్తులు ఆ ఇంటిలో లేకపోతే వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారో గుర్తించి వివరాలను నమోదు చేయాల్సి ఉందన్నారు. ప్రత్యేక కార్యాచరణతో పనులను వేగవంతం చేసి శాతాన్ని గణనీయంగా పెంచాలని అధికారులకు సూచించారు. బీఎల్వోలు ప్రతి గృహాన్ని తప్పని సరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయాలని, ఎవరూ మిస్కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు ఈఆర్వో రోజ్మండ్ దాసుకుప్పం, పేరడం గ్రామాల్లో పర్యటించి అక్కడ వీఆర్వోలు కొనసాగిస్తున్న సర్ కార్యక్రమ తీరు తెన్నులను ఆమె పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్వే డీటీ త్యాగరాజు, వీఆర్వోలు వినోద్కుమార్, రమేష్, కలై వనన్, వీఆర్ఏ మౌనిక, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధురి, బీఎల్వోలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తులో ఆటలొద్దు

### - యువతకు, విద్యార్థులకు అండగా రాహుల్ గాంధీ
### - అధ్యక్షులు బాలగురవం బాబు డిమాండ్




తిరుపతి హెల్త్, జూన్ 26 ప్రభాతవార్త:
దేశంలో విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రంగా మారిందని నీట్ పరీక్షల నిర్వహణతో కేంద్ర ప్రభుత్వ అసమర్థత బట్టబయలు అయిందని తక్షణం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ను బర్త్ రఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు బాలగురవం బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ దిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి అప్పగించి ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతోనే దేశంలో లక్షలాదిమంది యువత భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని, వారి జీవితాలను అంధకారంలోకి నెట్టేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలోని ప్రశ్నించే గొంతుకులను కాంగ్రెస్ పార్టీపై బిజెపి ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులతో అరికట్టే చర్యలకు పాల్పడు తోందన్నారు. దేశంలోని కోట్లాదిమంది విద్యార్థులు తమ ఉన్నత భవిష్యత్తు కోసం కలలుకనే వ్యవస్థను నిర్మించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యువతకు, విద్యార్థులకు లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షులు గౌడపేర చిట్టిబాబు మాట్లాడుతూ నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీ భారత విద్యా వ్యవస్థలో లోపాలను బయట పెట్టిందని చెప్పారు. ఈ రకమైన లోపాలు దేశంలోని అత్యున్నత పరీక్షా వ్యవస్థలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీశాయని అన్నారు. నీట్ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్ల ఫీజులు, స్టడీ మెటీరియల్స్ కోసం ఇప్పటికే లక్షలాది రూపాయలు వెచ్చించిన తల్లిదండ్రులపై అదనపు ఖర్చులు, వసతి ఖర్చుల భారం పడిందని వివరించారు. రాత్రి, పగలు కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చడానికి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులు ప్రశ్నాపత్రాల లీకేజీ తో మరింత తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యేలా చేసిందని మండిపడ్డారు. ఇందుకు కారణమైన కేంద్ర విద్యా శాఖ మంత్రిని తక్షణం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా విద్యార్థులకు అండగా కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ఉన్నారని చెప్పారు. ప్రశ్నాపత్రాల లీకేజీ తర్వాత మళ్లీ నీట్ పరీక్షలు నిర్వహించిన కేంద్ర ప్రభుత్వం తుది శ్వాస విడిచిన విద్యార్థుల ప్రాణాలను తీసుకురాగలదా? అని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి దురదృష్టకర సంఘటనలు జరగకుండా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఎస్యుఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ మాట్లాడుతూ లీకైన ప్రశ్నపత్రాలను కొనుగోలు చేసిన వారికి, అక్రమాలకు పాల్పడిన వారికి ఎక్కువ మార్కులు రావడం వల్ల, నిజాయితీగా కష్టపడి చదివిన ప్రతిభావంతులైన విద్యార్థులకు మంచి ర్యాంకులు రాక సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెసు పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ తలప దామోదర్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్చార్జ బల్ల హరిబాబు, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకటాచలపతి, వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ పంట శ్రీనివాసులు రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ ఐరాల లోకేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా ఎస్టి విభాగం అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి!

వడమాలపేట, జూన్ 26 ప్రభాతవార్త:



చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. వడమాలపేట ఎస్ఐ హరీష్ కథనం మేరకు... తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు గ్రామానికి చెందిన మునస్వామి(40) బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన మునస్వామి తిరిగి రాలేదు. శుక్రవారం మధ్యాహ్నం కాయం చెరువులో మృతదేహం తేలిఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి శవాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మునస్వామికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పనులను పరిశీలించిన పంచాయతీరాజ్ కమిషనర్

రేణిగుంట జూన్ 26 ప్రభాతవార్త:
రేణిగుంట మండలంలో జల్ సంచయ్ జన్ భాగిదారి 2.0 పథకంలో భాగంగా జరిగిన పనులను పంచాయతీరాజ్ కమిషనర్ విఆర్ కృష్ణతేజ ఇతర జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలో నిర్ణయించిన పనులు ఇప్పటివరకు ఎంతవరకు పూర్తయ్యాయి తదితర అంశాలను రికార్డుల పరంగా తనిఖీ చేశారు. ప్రాణధారమైన నీటిని కాపాడు కోవాల్సి న బాధ్యత అధికారులతో పాటు ప్రజలపై కూడా ఉందన్నారు. నీరే అన్ని జీవరాసులకు జీవనాధారం అని తెలిపారు. ఒక్క చుక్క నీటి బొట్టు వృధా కాకూడదని అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు, ఎంపీడీవో రవిచంద్ర, పిడబ్ల్యుడి డ్వామా ఎంసీ మద్దిలేటి, ఎస్ జి ఎస్ డబ్ల్యు జిల్లా ఆఫీసర్ గంగాభవాని , రేణిగుంట మండల ప్రోగ్రామ్ ఆఫీసర్ దీప తదితరులు పాల్గొన్నారు....

# అవిలాలలో భూమి వివాదం!

## - చంద్రగిరిలో రాజకీయ దుమారం



తిరుపతిరూరల్,జూన్ 26 ప్రభాతవార్త:
తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామంలో భారీ భూమి వివాదం రాజకీయంగా వేడెక్కుతోంది. సుమారు 100 కోట్ల విలువైన 3.17 ఎకరాల భూమిపై అక్రమాల ఆరోపణలు వెలువెత్తడంతో ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాలుగా ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్న ఈ స్థలం ఇటీవల వ్యక్తిగత పేర్లకు మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూమి స్వభావం మార్పు రికార్డుల మార్పిడి, జిపిఏ జారీ వంటి అంశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**స్థల పరిశీలనలో ఉద్రిక్తత:**
అవిలాలలో వివాదస్పద భూమిని పరిశీలించేందుకు వెళ్లిన చెవిరెడ్డి మోహిత్రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఇది మరింత అనుమానాలకు తావిస్తోందని ఆయన పేర్కొన్నారు. చట్టబద్ధంగా పరిశీలనకు వెళ్లినా అనుమతి ఇవ్వలేదని దీని వెనక ఎవరు ఉన్నారో తెలియాల్సి ఉందన్నారు. ప్రభుత్వ భూమి వ్యక్తిగతంగా ఎలా మారింది? జీపిఏలు ఏ ఆధారంగా జారీ అయ్యాయి? తుడా అనుమతులు ఏ విధంగా మంజూరు అయ్యాయి? కాలువ పోరంబోకు భూమిలో నిర్మాణాలకు అనుమతి ఎలా లభించింది? అనే ప్రశ్నలకు స్పష్టత అవసరమని పేర్కొన్నారు.

**సిట్టింగ్ జడ్జితో దర్యాప్తుకు డిమాండ్:**
అవిలాల భూ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ అవసరమని, సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయించాలని మోహిత్రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం ప్రజలకు సూచన చేశారు. భూముల రికార్డులు, పత్రాలు నిరంతరం తనిఖీ చేసుకోవాలని, వివాదస్పద ప్రదేశాల్లో ప్లాట్లు కొనుగోలు చేయడంతో జాగ్రత్త అవసరమని, అధికారిక ధృవీకరణ లేకుండా పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. చంద్రగిరి ఎమ్మెల్యేపై ఈ వ్యవహారంలో పాత్ర ఉందని, ప్రత్యర్థి వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఆయన అనుచరుల పేర్లపై భూమి బదిలీ జరిగిందని విమర్శించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## చెడు అలవాట్లకు దూరంగా వుంటే... ఉజ్వల భవిష్యత్తు

- విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన పోలీసులు



దొరవారిసత్రం, జూన్ 26 ప్రభాతవార్త: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా దొరవారిసత్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ కాలేజీలో విద్యార్థుల కోసం నిర్వహించిన అవగాహనా కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది. ఈ కార్యక్రమంలో సూళ్ళూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ, నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, సూళ్ళూరుపేట ఎస్ఐ గంటా అజయ్ కుమార్, దొరవారిసత్రం పోలీస్ సిబ్బంది మరియు సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సూళ్ళూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ మాట్లాడుతూ నేటి యువత మాదకద్రవ్యాల ఊబిలో చిక్కుకుంటే వారి జీవితాలు అంధకారమవుతాయని హెచ్చరించారు. డ్రగ్స్ రవాణా, నిల్వ లేదా వినియోగం వంటివి కేవలం ప్రాణాలకే కాకుండా, ఉజ్వల భవిష్యత్తును పూర్తిగా నాశనం చేసే తీవ్రమైన నేరాలని గుర్తు చేశారు. చిన్నపాటి ఆకర్షణలకు లోనై చెడు అలవాట్లకు బానిసలైతే, చట్టపరమైన కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని, పోలీసు రికార్డుల్లో నేరస్తులుగా నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు సైతం దెబ్బతింటాయని ఆయన విద్యార్థులకు స్పష్టం చేశారు. అనంతరం నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు మాట్లాడుతూ, వ్యసనాల వల్ల శారీరక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, మానసిక స్థిరత్వం కోల్పోయి క్రమశిక్షణ లేని జీవితానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు పుస్తకాలే ప్రాణంగా, లక్ష్య సాధనే ధ్యేయంగా ఎదగాలని, మాదకద్రవ్యాల వంటి వ్యసనాల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్నేహితుల ఒత్తిడికి లొంగకుండా, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మరియు సిబ్బంది పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, యువత తప్పుడు మార్గాల్లో వెళ్లకుండా కన్నతల్లిదండ్రులు కూడా నిరంతరం పర్యవేక్షించాలని పోలీసులు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

## నేడు వెంకటగిరికి...సత్యసాయి అఖండ జ్యోతి రథం రాక



వెంకటగిరి, జూన్ 26 ప్రభాతవార్త: శ్రీసత్యసాయి అఖండ జ్యోతి భగవాన్ శ్రీసత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో పుట్టపర్తి ప్రశాంతి నిలయం నుండి అఖండ జ్యోతి దేశవ్యాప్తంగా పర్యటిస్తు ఈ నెల 27వ తేది శనివారం సాయంత్రం వెంకటగిరికి వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం శ్రీకాశీ విశ్వనాధ స్వామి గుడి నుండి శోభాయాత్ర ప్రారంభమవు తుందని చెప్పారు. పూర్ణ కుంభ స్వాగతంతో వేదమంత్రాలతో మంగళ వాయిద్యాలతో భజనలతో శోభా యాత్ర కాశీపేట, రాజవీధి, నగరి వెనకల వీధి, ఆంజనేయ స్వామి గుడి వీధి, బజారు వీధి, పోలేరమ్మ గుడి రాజాగారి నగరి మీదుగా శ్రీసత్యసాయి సేవా సమితి వద్దకు చేరుకుంటుందని తెలిపారు. మందిరంలో అఖండ జ్యోతిని ఉంచి భజన మంగళ హారతితో కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. రాత్రికి వెంకటగిరి మందిరంలోనే అఖండ జ్యోతిని ఉంచుతారని తెలిపారు. భక్తులు రాత్రి 9 గంటల వరకు జ్యోతిని దర్శించుకోవచ్చు అని చెప్పారు. ఆదివారం తెల్లవారి 5 గంటలకు ఓంకారము సుప్రభాతము నగర సంకీర్తన జరుగుతాయని చెప్పారు. ఉదయం 7 గంటల పైన జ్యోతి ని ఏర్పేడు మందిరం వాళ్ళు వచ్చి తీసుకొని అని చెప్పారు.అప్పటి వరకు భజనను కొనసాగిస్తు మంగళ హారతితో ఈ కార్యక్రమాన్ని స్వామి ఆశీస్సులతో పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. అందువల్ల 27వ తేది శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు సేవా సమితి సభ్యులు బాలవికాస్ గురువులు బాలవికాస్ పిల్లలు వారి తల్లితండ్రులు భక్తులు పురప్రముఖులు అధిక సంఖ్యలో శ్రీ కాశీ విశ్వనాధ స్వామి వారి గుడి వద్దకు చేరుకొని ఈ అఖండ జ్యోతి శోభాయాత్రలో పాల్గొని పవిత్రమైన జ్యోతిని దర్శించుకొని భగవన్ శ్రీసత్యసాయి నాధుని దివ్య అను గ్రహ ఆశీస్సులు పొందాలని కోరారు.

## అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం




పెళ్లకూరు, జూన్ 26 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం నిధుల కొరతతో సతమతమవుతున్న ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట కోసం సూపర్ సిక్స్ లో ఇచ్చిన ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేస్తున్నామ న్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు తప్పకుండా చేరేలా చేయాల్సి న బాధ్యత ప్రతి ఒక్క కూటమి నాయకుని పై ఉందన్నారు. కూటమిలో ఉన్న తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన బిజెపి కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించాలని శుక్రవారం నాడు పెళ్లకూరు మండలంలోని రోసనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అక్కడికి విచ్చేసిన పార్టీ కార్యకర్తలను, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ప్రజలు ఎక్కువగా రైతులు ఎదుర్కొంటున్న ఏరియా కొరతను గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రాగా అక్కడ ఉన్న అధికారులను ఉద్దేశించి యూరియా విషయంలో ఎలాంటి సమస్యలున్న వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు సంచి. కృష్ణయ్య, శిరసునం భేటీ. చైతన్య కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సిద్దిలయ్య నాయుడు, కందమూడి. శివకుమార్, అక్కరపాక మాధవరెడ్డి, దేవా రెడ్డి నాగేందర్ రెడ్డి, సత్యం రాజు, దువ్వూరు రాకేష్ రెడ్డి, నర్రావుల లోకేష్ నాయుడు, తాళ్ల రెడ్డి శ్రీనివాస్, రాపూరు పరుశురాం, మేక పిల్ల రవి, ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## సిఎం, డిసిఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: ముక్కా



రైల్వేకోడూరు రూరల్, జూన్ 26(ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి చౌహాన్ లు రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట ప్రాంతానికి వస్తున్న సందర్భంలో రైల్వే కోడూరు మండలంలోని రాఘవరాజు పురంలో కూటమి నాయకులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, బిజెపి నాయకులు గడ్డం చెంగల్‌రాజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులను ఉద్దేశించి టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన వివిజి రాంజీ గ్రామీణ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీరు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న ఉన్నారని, ఈ కార్యక్రమాన్ని కూటమి నాయకులు విజయవంతం చేయాలని రూపానందరెడ్డి పిలుపునిచ్చారు. మొట్టమొదటిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో రైల్వేకోడూరు రావడం అత్యంత విశేషమని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు కోడూరు ప్రాంతాల నుండి భారీగా జన సమైక్యరైన చేసి ముఖ్యమంత్రి వద్ద శభాష్ అనిపించుకోవాలని ఆయన తెలియజేశారు. ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి లో వస్తున్న సందర్భంలో కూటమి నాయకులు విరివిగా పాల్గొని రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరు ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆరవ శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు కట్ట బాలాజీ, మల్లిశెట్టి మురళీధర్ గౌడ్, సురపు రాజు సుబ్బరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగారాజు రవి కుమార్ రాజు, ఓబులవారిపల్లి మాజీ మండల అధ్యక్షుడు గంగరాజు వెంకటేశ్వరరాజు, మంగంపేట యువ నాయకులు తల్లెం రమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, పట్టణ అధ్యక్షుడు పోకల బాబు, క్లస్టర్ ఇంచార్జ్ పటాన్ మోలా, తిప్పన రాజశేఖర్, పసుపులేటి జయచంద్ర, పందేటి వెంకటరామరాజు, మద్దెనగిరి, ఉంగరాల సురేంద్ర కుమార్ తోపాటు కూటమికి చెందిన నాయకులు పాల్గొన్నారు

## పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా



పుత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త : ప్రజలకు పోలీస్ శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్‌కుమార్ గుప్తా సూచించారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన డిఎస్పీ కార్యాలయం ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పుత్తూరు సబ్‌డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతి, భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మహిళలు, చిన్న పిల్లల భద్రత, పోలీస్ సేవల నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందనతో చట్టబద్ధమైన చర్యలు తీసుకో వాలని తెలిపారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ శాంతి, భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమర్ధవంతంగా పనిచేస్తోందని అభినందించారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అదనపు డిజిపి మధుసూదన్‌రెడ్డి, నగరి, సత్యవేడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాశ్, కె.ఆదిమూలం, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో... నేరాల నియంత్రణ

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా



తిరుపతి, జూన్ 26ప్రభాతవార్త: కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, సిసి కెమెరాల పర్యవేక్షణతో శాంతిభద్రతలు, నేరాలనియంత్రణ చేస్తున్న విధానం భేష్‌గా ఉందని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. తిరుపతి జిల్లాలో అమలవుతున్న ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై డిజిపి సమీక్షించారు. ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై ఆయన స్వయంగా జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డ్రోన్ సాంకేతికతను నేర నియంత్రణ, జనసమ్మర్ధ నిర్వహణ, ప్రత్యేక ఆపరేషన్లలో సమర్ధవంతంగా వినియోగిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. తిరుపతి జిల్లాలో అటు యాత్రికుల ఇటు ప్రజల భద్రతకు ఆధునిక సాంకేతిక ఆధారిత పోలీసింగ్ విధానం అమలుచేస్తుండటం అభినందనీయమని గుప్తా తెలిపారు. శుక్రవారం ఉదయం పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్, జిల్లా పోలీస్ కార్యాలయం ప్రధాన ప్రవేశ ద్వారం (గ్రౌండ్ గేట్), ప్రహరీగోడనిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీనివాస్,రవిమనోహరచారి,శ్రీలత, రామకృష్ణ, డిఎస్పీలు, సిఐలు,పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు సోమశేఖరరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కుప్పంలో వ్యవసాయ.. ఉద్యాన పరిశోధన కేంద్రం ఏర్పాటు

- వ్యవసాయ వర్సిటీ వి.సి. ఆచార్య సత్యనారాయణ



శాంతిపురం, జూన్ 26 ప్రభాతవార్త: ప్రభుత్వం సూచనల మేరకు కుప్పం నియోజకవర్గంలో వ్యవసాయ, ఉద్యానవన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి ఆచార్య సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మిగానిపల్లి వద్ద సమగ్ర వ్యవసాయ మరియు ఉద్యాన పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రంకు కేటాయించిన స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ స్థితులు, మార్కెట్ అవసరాలు, సహజ వనరుల పరిరక్షణ దృష్టిలో ఉంచుకుని రైతుల పంటల విధాన మార్పు, డిమాండ్ ఆధారిత వ్యవసాయంను అవలంబించి రైతు సేవలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ముందంజలో ఉందన్నారు. పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ ఆధునిక శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి రైతు గడపకు చేర్చేలా కట్టుబడ్డామన్నారు. రైతుల ఆదాయం పెంపొందించే సాంకేతికలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం, పరిశోధన కేంద్రాల ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, సహజ వ్యవసాయం, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై శిక్షణ అందిస్తామన్నారు. కుప్పం ప్రాంతంలో ఈ నాలెడ్జ్ హబ్ రాష్ట్రంలో ఓ మైలు రాయిగా నిలుస్తుందన్నారు. యువత, మహిళా రైతులను ప్రోత్సహి స్తామన్నారు. రైతులు, శాస్త్రవేత్తల మధ్య ప్రత్యక్ష సంబంధాలు పెంచుతామన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ సుమతి, సహ సంచాలకులు డాక్టర్ చంద్రిక, ఏరువాక కేంద్రం ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, శాస్త్రవేత్తలు కదిరి మోహన్, రాజేష్, డాక్టర్ బాలాజీ నాయక్, అభ్యుదయ రైతు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు పేరు...నమోదయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్




పుత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా జాగ్రత్త తీసుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియపై పార్టీ బూత్ ఇన్‌ఛార్జ్‌లు, బిఎల్ఎలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియలో ఓటర్ల నమోదు విషయంలో మరింత వేగం పెంచాలని సూచించారు. బూత్ స్థాయిలో చేపడుతున్న ఓటర్ల జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఓటరు వివరాల నమోదు ప్రక్రియపై చర్చించారు. బిఎల్ఎలు ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే భానుప్రకాశ్ అన్నారు. నగరి నియోజకవర్గ పరిధిలో 26 మందికి రూ. 25,86,769 లక్షలను సిఎం రిలీఫ్ ఫండ్‌ను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. పుత్తూరు మునిసిపాలిటీలో 18 మందికి, వడమాలపేట మండలంలో ఒకరికి, విజయపురం మండలంలో 7గురికి ఆర్థిక సాయం అందించారు.

## శిలాఫలకాలు ధ్వంసం!



తడ, జూన్ 26 ప్రభాతవార్త: తడ మండలం వెండ్లూరుపాడు గ్రామంలో నూతనంగా వేసిన సిమెంట్ రోడ్డు వివరాలు పొందుపరిచిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా వెండ్లూరుపాడు గ్రామంలో రెండు విడతలగా సుమారు 20 లక్షల వ్యయంతో వెండ్లూరుపాడు దళితవాడ, పొన్నపాడు దళితవాడ, దండుబాడు వద్ద సిమెంటు రోడ్లు వేశారు. అభివృద్ధి కార్యక్రమాల వివరాలను పొందు పరిచేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే విజయశ్రీని చేతుల మీదగా సిమెంటు రోడ్డును ప్రారంభించేందుకు వేచి చూస్తున్న తరుణంలో గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ వ్యక్తులు చేశారా? ఆకతాయిలు చేసి ఉంటారా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి కానీ రెండు వేరువేరు ప్రాంతాలలో ఒకేరోజు శిలాఫలకాలు ధ్వంసం కావడంతో కక్షపూరితంగానే చేసినట్టు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు

### శ్రీ బాలాజీ ఆసుపత్రి నందు...

## అన్ని శస్త్ర చికిత్సలు ఉచితం!

-శ్రీ బాలాజీ ఆసుపత్రి చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి



రేణిగుంట, జూన్ 26 ప్రభాతవార్త: రేణిగుంట పట్టణ సమీపంలో విమానాశ్రయం వెళ్లే మార్గం వద్ద ఉన్న శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రి రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ నందు రెండు నెలల పాటు అన్ని శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి తెలిపారు. సంస్థ ప్రారంభించి ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆయన శుక్రవారం అన్నారు. ఆసుపత్రి ప్రారంభిం చినది మొదలు ఓపి సేవలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. 24 గంటలు వైద్యులు వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ ఎంతోమందిని ప్రాణాపాయం నుండి కాపాడగలి గామన్నారు. ఎన్టీఆర్ ఉచిత వైద్య సేవ వర్తించని వారికోసం ఉచిత క్యాంపు ను నిర్వహిస్తు న్నామన్నారు. శాస్త్ర చికిత్సలు చేసుకుంటున్న వారికి వైద్య పరీక్షలు, ఇన్వెస్టిగేషన్లు, సర్జరీ సామాగ్రిపై 50శాతం, ఫార్మసీ మందులు, కన్స్యూమబుల్స్, ఇంప్లాంట్లు, అవసరమైన ఇతర సర్జరీ సామాగ్రిపై 30 శాతం రాయితీని కల్పిస్తున్నా మన్నారు. ముఖ్యంగా జర్నలిస్టులకు, తమ స్టాఫ్ కుటుంబ సభ్యులకు మరో పది శాతం అదనంగా రాయితీ ఇస్తామన్నారు. ప్రస్తుతం కంటికి సంబంధించిన సాధారణ వైద్య సేవలు అందిస్తు న్నామని కాట్రాక్(కంటి శుక్లం)సర్జరీ చేస్తున్నామని అతి త్వరలో కంటికి సంబంధించిన అన్ని వైద్య సేవలు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలు పూర్తిగా ఉచితమని, సర్జరీ చేయించుకున్న వారితోపాటు వారితో వచ్చిన ఒక అటెండర్‌కు ఉచితంగా భోజన సదుపాయం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని పాణిగ్రాహి కోరారు.

## వజ్రకవచంలో మెరిసిన వెంకన్న ఉత్సవర్లు

-వేడుకగా జ్యేష్ఠాభిషేకం





తిరుమల, జూన్ 26 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలేశుని ఉత్సవమూర్తులు తరతరాలుగా అభిషేకాలతో అరిగిపోకుండా ఉండేందుకు ఏటా నిర్వహించే జ్యేష్టాభిషేకాలు శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగాయి. జీయంగార్లు, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో నిర్వహించారు. మొదటి రోజే శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవర్లు వజ్రకవచంలో మెరిశారు. జ్యేష్ట మాసంలో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేట్లుగా మూడురోజుల పాటు జ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం వజ్ర కవచంలో ఉత్సవమూర్తులు దర్శనమిచ్చారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓలోకనాథం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఝుమ్మంది నాదం...సై అందిపాదం

-మహతిలో అలరించిన శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ నృత్య పోటీలు






తిరుపతి,జూన్ 26ప్రభాతవార్త : మన సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాల వారికి అందించాలనే లక్ష్యంతో వ్యయప్రయాసలకోర్చి అనేక సంవత్స రాలుగా నృత్య పోటీలు విజయవంతంగా నడిపిస్తున్న రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కార్యదర్శి కే ఎన్ రాజాల పనితీరు అభినందనీయమని వక్తలు తెలిపారు.. శుక్రవారం ఉదయం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో మూడురోజులు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జరిగే "శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్" జాతీయ నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారుల అద్భుత నృత్య ప్రదర్శనలతో నగర ప్రజలను, కళాభిమానులను అలరించారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన చిన్నారులు అద్భుతంగా తమ కళా ప్రదర్శనను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కే ఎన్ రాజా,ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, గౌరవ కార్యదర్శి కస్పా పద్మనాభం,సభ్యులు డాక్టర్ సోము ఉమాపతి, పురోహితులు సురేష్ స్వామి,బండారి భాస్కర్ రెడ్డి,ఆర్ ఎం ఎస్ భాస్కర్,సిద్ధేంద్ర శర్మ,ఆమూరు సుబ్రహ్మణ్యం, చంద్రబాబు నాయుడు,కన్నప్ప గారి కేశవులు, విగ్రహాల కళ్యాణి, మునేంద్ర రెడ్డి, ఆముదాల నారాయణ తదితరులు పాల్గొన్నారు

## .శ్రీకాళహస్తిలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా... అఖండ జ్యోతి



శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో ప్రశాంతి నిలయం నుంచి బయలుదేరిన అఖండ జ్యోతి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తికి చేరుకుంది.బహదూర్‌పేట భజన మందిరం వద్ద నుంచి ప్రారంభమైన అఖండ జ్యోతి ఊరేగింపు ఉప్పు వీధి, నాయుడు బిల్డింగ్స్ ప్రధాన వీధి, ముత్యాలమ్మ గుడి వీధి, నగరి వీధి, బజార్ వీధి, తేరు వీధి, నెహ్రూ వీధి మార్గాల గుండా ప్రయాణించి చివరగా శ్రీ సత్యసాయి మందిరానికి చేరుకోనుంది.శుక్రవారం రాత్రి అఖండ జ్యోతిని శ్రీకాళహస్తిలోని శ్రీ సత్యసాయి మందిరంలో భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగింది.